RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 28 శనివారం 22 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

## ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ : వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల క్యాంప్‌సల ఎంపికను ఈ మార్పులు ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియాను ఎంపిక చేసుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2004లో 1,18,109 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకొన్నారు. తమ విద్యార్థి వీసా నిబంధనల్లో పేర్కొనదగ్గ మార్పులను చేయనున్నట్లు గత ఏడాది ఆస్ట్రేలియా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం.

# పేదవారి సొంతింటి కలను నెరవేరుస్తాం..

# మహిళలను బలోపేతం చేస్తాం...

## నారాయణ పేటలో ఇందిరమ్మ ఇళ్ళకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి




నారాయణ పేట : పేదవారి ఇంటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణ పేట జిల్లా అప్పకపల్లె గ్రామంలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం 72,045 గృహాలకు శంఖుస్థాపన చేశారు. అనంతరం సీఎం పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ వస్తున్నామని, సంఘాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని, గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోలేదన్నారు. మహిళా సంఘాలు మరింత ఆర్థికంగా ఎదగాలని అప్పుడే కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడి మరో పది మందికి సహాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంట్లో ఆడబిడ్డ చేతిలో డబ్బు ఉంటే తమ పిల్లల చదువు కోసం, కుటుంబ గౌరవం కోసం ఖర్చు చేస్తారని సీఎం అన్నారు. అందుకే స్వయం సహాయక సంఘాలను ప్రోత్సాహిస్తున్నట్లు సీఎం అనగానే, సభకు వచ్చిన మహిళలు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

**సీఎం శంకుస్థాపనల వివరాలివే..** రూ.130 కోట్లతో నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాల, హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన. రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన. రూ.40 కోట్లతో 100 పడకల యూనిట్ కు శంకుస్థాపన. రూ.296 కోట్లతో తుంకిమెట్ల నారాయణపేట రోడ్, కొత్తకొండ మద్దూర్ రోడ్ అభివృద్ధి పనులకు, అప్పకపల్లి గుండామల్ రోడ్, మద్దూర్ లింగాల్ చెడ్ రోడ్ లలో హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన. రూ.193 కోట్లతో గుల్బర్గా కొడంగల్, రావులపల్లి మద్దూరు, కోస్గి దౌలతాబాద్ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన. రూ.12.70 కోట్లతో నారాయణపేట నియోజకవర్గంలో సిఆర్ఆర్ రోడ్లకు శంకుస్థాపన.

**ప్రారంభోత్సవాల వివరాలు :** రూ.56 కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాల అకడమిక్ బ్లాకులను ప్రారంభించిన సీఎం. రూ.5.58 కోట్లతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభించిన ముఖ్యమంత్రి. రూ.1.23 కోట్లతో జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించే పెట్రోల్ బంక్ ను ప్రారంభించిన సీఎం. రూ.7 కోట్లతో మరికల్ మండల పరిషత్ ఆఫీసు కాంప్లెక్స్ భవనం ప్రారంభించిన సీఎం.

**మెడికల్ కాలేజీ లో విద్యార్థులతో సీఎం ముఖాముఖి :** నారాయణ పేట మెడికల్ కాలేజీ లో విద్యార్థులతో సీఎం ముఖాముఖిగా మాట్లాడారు. సీఎం మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో ఒక మెడికల్, పారామెడికల్, నర్సింగ్ కాలేజీ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కేంద్రం తిరస్కరించినా.. మా మంత్రి, అధికారులు తీవ్రంగా ప్రయంత్నించి ఎనిమిది మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని సీఎం అన్నారు. కాలేజీలో పూర్తి స్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని హామీ ఇచ్చారు. నిజమైన పేదవారికి సంక్షేమం చేరినప్పుడే అభివృద్ధి జరిగినట్లని బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారని, అందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మీ అవసరాలపై అవగాహన ఉన్నవారే మీ ఎమ్మెల్యేగా ఉన్నారని, పేదలకు విద్య అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. డాక్టర్ వృత్తి ఒక ఉద్యోగంగా కాకుండ, ఒక బాధ్యతగా గుర్తించాలని సీఎం సూచించారు. మీరంతా గొప్ప డాక్టర్లుగా రాణిస్తే రాష్ట్రానికి మంచి సేవలు అందించగలరని, యాభై ఏళ్లు ఇక్కడి ప్రజలకు సేవలందించిన చిట్టెం నర్సిరెడ్డి పేరు ఈ కాలేజీకి పెట్టడం సముచితమని తాను భావిస్తున్నట్లు సీఎం అనగానే విద్యార్థులు చప్పట్లు మారుమ్రోగించారు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనగా, నారాయణ పేట జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఒకే రోజు రికార్డ్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేయడం ఇదే తొలిసారిగా పేర్కొన్న ప్రజలు, సీఎం ప్రసంగం సాగినంత సేపు జై కాంగ్రెస్, జై రాహుల్, జైజై రేవంత్ రెడ్డి అంటూ నినాదాలిచ్చారు. సీఎం వెంట మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు ఉన్నారు.

# మహా కుంభమేళాకు ఒక్కసారిగా పోటెత్తిన భక్తజనం




లక్నో: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనం.. మహా కుంభమేళా మరో ఐదురోజుల్లో ముగియనుంది. చివరి వారాంతం కావడంతో ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు ఒక్కసారిగా పోటెత్తారు. ఇవాళ 40వ రోజు ఉదయం రికార్డు స్థాయిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిట్లు అధికారులు ప్రకటించారు. కుంభమేళా ముగుస్తుండడంతో ప్రయాగ్‌రాజ్ సంగమంకు భక్తుల తాకిడి ఒక్కసారిగా పెరిగింది. మేలా ప్రాంతంలో హెూటల్స్, ధర్మశాలలు కిక్కిరిసిపోయాయి. గురువారం సాయంత్రం గణాంకాల ప్రకారం.. మొత్తంగా 58 కోట్ల మంది పుణ్యస్నానాలు పూర్తి చేసుకున్నారని అధికారులు ప్రకటించారు. శని, ఆది వారాల్లో భక్తుల తాకిడి మరింత అధికంగా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు.

**గత వారంగా కుంభమేళా భక్తుల సంఖ్య :** ఫిబ్రవరి 13, గురువారం: 80 లక్షల 46 వేలు, ఫిబ్రవరి 14 శుక్రవారం: 94 లక్షల 98 వేలు, ఫిబ్రవరి 15 శనివారం: కోటి 36 లక్షల మంది, ఆదివారం: కోటి 49 లక్షల మంది. సోమవారం: కోటి 35 లక్షల మంది. మంగళవారం : కోటి 26 లక్షల మంది. బుధవారం: కోటి 19 లక్షల మంది. గురువారం: కోటి 55 లక్షల మంది..

ఇక.. కుంభమేళా నిర్వహణపై రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. జనవరి చివరి వారంలో మౌనీ అమవాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట 30 మంది మరణించిన సంగతి తెలిసిందే.

దీంతో రాబోయే రద్దీని నియంత్రించేలా అధిక సిబ్బందిని నియమించారు. మరోవైపు.. పరిసరాలను, సంగమ నీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకుంటున్నారు. ఇప్పటికే వీఐపీ పాస్‌లను రద్దు చేసిన అధికారులు.. వాహనాల రాకపై కూడా కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు.

**రైల్వే శాఖ కీలక నిర్ణయం :** మహా కుంభమేళా ముగుస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో ప్రయాగ్‌రాజ్ వెళ్తున్నారు. రైల్వే స్టేషన్‌లు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు స్టేషన్‌లలో ప్రత్యేక హెూర్డింగ్‌లను ఏర్పాటు చేయించింది.

సురక్షిత ప్రయాణం కోసం తాము సూచించే మార్గదర్శకాలను పాటించాలని అందులో విజ్ఞప్తి చేస్తోంది. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట చోటు చేసుకుని 18 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.




## ఒకే వేదికపై రేవంత్ రెడ్డి, డీకే అరుణ..

తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య విమర్శల పర్వం పీక్స్ కు చేరుకుంది. ఏ చిన్న అవకాశం దొరికినా అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు బీజేపీ నేతలు పంచ్ డైలాగులతో విరుచుకుపడుతున్నారు. ముఖ్యమంగా సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీ డీకే అరుణకు మధ్య రాజకీయ విభేదాలు అందరికీ తెలిసిందే. సందర్భం వస్తే ఇరువురు నేతలు ఒకరిపై మరొకరు విరుచుకుపడుతూ రాజకీయాన్ని మరింత ఆసక్తిగా మారుస్తుంటారు. అటువంటిది ఈ ఇరువురు నేతలు ఇప్పుడు ఒకే వేదికను పంచుకోవడం, సరదాగా ముచ్చటించుకోవడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ నారాయణపేట జిల్లాలో పర్యటించారు. అప్పక్ పల్లేలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్ ప్రారంభించారు. అనంతరం అక్కడి మహిళా సమాఖ్య సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేదికపై రేవంత్ రెడ్డితో పాటు ఎంపీ డీకే అరుణ, మంత్రి సీతక్క తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి, డీకే అరుణ సరదాగా మాట్లాడుకోవడం ఆసక్తిగా మారింది.

## పాత సెంటిమెంటుకు కొత్త రంగులద్ది...!

# కేసీఆర్ అదే రాజకీయం!

## కేసీఆర్ కు మళ్లీ చంద్రబాబే దిక్కా? రేవంత్‌కూ కత్తిమీద సాము..!







హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ కు ఇది తొలి ఓటమి. అంతే కాదు తెలంగాణ సెంటిమెంట్ కు కాలం చెల్లిందని నిరూపించిన ఎన్నిక కూడా. ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులే కరువైన బీఆర్ఎస్.. చివరికి సున్నాతో సరిపెట్టుకుంది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలకూ దూరమైంది. ఈ నేపథ్యంలో ఏదో ఒక మ్యాజిక్ చేస్తే తప్ప రాజకీయంగా కోలుకోవడం కష్టమని భావిస్తున్న కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచే వ్యూహరచన చేస్తున్నారు. కేవలం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుతత్వ తప్పిదాల్ని మాత్రమే నమ్ముకుంటే కోలుకోవడం కష్టమని భావిస్తున్న కేసీఆర్ దళం.. ఇప్పుడు వ్యూహాలకు పదునుపెడుతోంది. ఓవైపు ప్రభుత్వ తప్పిదాల్ని ఎండగడుతూనే మరోవైపు పాత సెంటిమెంట్ కు కొత్త రంగులద్ది రాజేసే పనిలో బిజీగా కనిపిస్తోంది. తాజాగా కేసీఆర్ తన ప్రసంగంలో ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రస్తావన తెచ్చారు.

ఎన్డీయే పేరుతో మళ్లీ తెలంగాణ రాజకీయాల్లోకి రావాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారంటూ పార్టీ శ్రేణుల్ని, రాష్ట్ర ప్రజల్ని అలర్ట్ చేశారు. తెలంగాణ ఏర్పాటును ఆపేందుకు ప్రయత్నించిన ఆయన్ను మనం ఇప్పుడు ఆపాల్సిందేనంటూ హితబోధ చేశారు. అయితే మారిన పరిస్థితుల్లో తెలంగాణ సెంటిమెంట్ ప్రభావం నానాటికీ తగ్గిపోతున్న తరుణంలో కేసీఆర్ తిరిగి చంద్రబాబు చుట్టూ రాజకీయాన్ని తిప్పేందుకు ప్రయత్నిస్తున్నట్లు దీన్ని బట్టి అర్థమవుతోంది. కేసీఆర్ ఇచ్చిన హింట్ తో రంగంలోకి దిగిన హరీష్ రావు.. నాగార్జున సాగర్ సమస్యపై ప్రెస్ మీట్ పెట్టారు.

నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అక్రమంగా నీటిని తోడుతోందని, చంద్రబాబును ప్రశ్నించే దమ్ము రేవంత్‌రెడ్డికి లేదని తేల్చేశారు. కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా లేదన్నారు. తద్వారా అటు కేంద్రంపైకి, ఇటు చంద్ర బాబుపైకి రేవంత్ ను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దీనికి కాంగ్రెస్ పార్టీ వెంటనే దూకుడుగా స్పందించలేదు. అయితే ఇక్కడ కేసీఆర్ వ్యూహం మాత్రం అందరికీ అర్థమైంది. మరోసారి చంద్రబాబును బూచిగా చూపుతూ తెలంగాణ రాజకీయాల్లో బలపడేందుకు కేసీఆర్ ప్రయత్నాలు ప్రారంభించేశారు. రాబోయే రోజుల్లో చంద్రబాబుతో కూడిన ఎన్డీయే, అందులో కీలకమైన బీజేపీని ఎదుర్కొనేందుకు కేసీఆర్ ప్రయత్నించబోతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం చంద్రబాబు తెలంగాణను అడ్డుకున్నారని, ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆంధ్రాకు మేలు చేస్తున్నారనే ప్రచారం జనంలోకి తీసుకెళ్లబోతున్నారు. దీన్ని గ్రహించిన రేవంత్ రెడ్డి జలవివాదాల విషయంలో వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది.

# సంపాదకీయం

## ఇకనైనా.. ఢిల్లీ రాజకీయం మారేనా?

దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు అందరికీ తెలిసిందే. ఇక్కడ ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఏర్పడినా.. మాయల ఫకీరు ప్రాణాలు చిలకలో ఉన్నట్టుగా.. దాదాపు ప్రధాన అధికారాలు అన్నీ కూడా కేంద్రం చేతిలో ఉంటాయి. ఇతర రాష్ట్రాలకు లేని విధంగా ఇక్కడ కేంద్రం అజమాయిషీ కనిపిస్తుంది. అంతేకాదు.. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్నికట్టడి చేసేందుకు.. మోడీ సర్కారు తెచ్చిన మరో చట్టం కూడా.. ఢిల్లీ పాలకులకు శాపంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే చిన్న స్థాయి ప్యూన్‌ను సైతం బదిలీ చేసే అధికారం లేకుండా.. కేంద్రం కొత్త చట్టం ద్వారా అధికారం బదలాయించుకుంది. ఇక, ఇప్పటికే ఉన్న చట్టాల ప్రకారం.. పోలీసులు, శాంతి భద్రతలు, ఎక్సైజ్, వంటి కీలక శాఖలు.. కేంద్రం పరిధిలోనే ఉంటాయి. అయితే.. రెవెన్యూ మాత్ర మే రాష్ట్ర సర్కారు పరిధిలో ఉన్నా.. లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఈ పరిణామాలే.. ఆప్ ప్రభుత్వానికి చేతులు కాళ్లు ఆడకుండా చేశాయి. ఇక, ఇప్పుడు బీజేపీ సర్కారే పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ పాలకులు సహకరించడం ఖాయమే. ఎందుకంటే.. రెండు కూడా డబుల్ ఇంజన్ సర్కారే కాబట్టి.. సహకారంపై ఎలాంటి సందేహం లేదు. కానీ, ఇక్కడే మరో కీలక విషయం ఉంది. ఆప్‌పై కోపంతో తెచ్చిన నూతన అధికారాల చట్టం విషయాన్ని ఏం చేస్తారన్నది ప్రశ్న. ప్రతి దానికీ కేంద్రాన్ని సంప్రదించాల్సిన అవసరం కల్పించిన ఈ చట్టం .. అలానే కొనసాగుతుందని కొందరు చెబుతుంటే.. కాదు మార్పు చేస్తారని మరి కొందరు అంటున్నారు. ఇక, పోలీసుల నియంత్రణ, శాంతి భద్రతలు వంటి అధికారాలను రాష్ట్ర సర్కారుకు తాత్కాలికంగా అయి నా.. బదిలీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక, గత పాలకులపై కేసుల విచారణ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు వంటివి రాష్ట్ర సర్కారే చూసే అవకాశం ఉందని సమాచారం. తాజాగా సీఎంగా ప్రమాణ స్వీకారానికి ముందు రేఖా గుప్తా మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. మార్చి నుంచి వాటిని పట్టాలెక్కిస్తామని కూడా ఆమె చెప్పుకొచ్చారు. ఈ పరిణామాలను గమనిస్తే.. రాష్ట్ర ఢిల్లీకి–కేంద్ర ఢిల్లీకి మధ్య గ్యాప్ తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నీటి నుంచే పూడికతీత



సిరిసిల్ల : వర్షాలు, వరదలతో జలాశయాల్లో ఏటా పూడిక పేరుకుపోతోంది. ఫలితంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. జలాశయాల్లో నీటిని ఖాళీ చేయకుండా అందులోని పూడికను తొలగించేందుకు కొత్త పద్ధతికి నీటిపారుదలశాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మూడు జలాశయాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. నిర్మల్ జిల్లాలోని కడెం, ఉమ్మడి జిల్లాలోని మధ్య, దిగువమానేరు జలాశయాలు ఉన్నాయి. ఈ పనులను గుత్తేదారులకు అప్పగించేందుకు గతేడాది డిసెంబరు చివరి వారంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ నీటిపారుదలశాఖ సర్కిల్‌లో ఈ నెల 27 వరకు టెండర్ల దాఖలుకు అవకాశం ఉంది. జలాశయాల్లోని పూడికపై గతంలో సర్వే చేశారు. ఈ నివేదికలో రాష్ట్ర వ్యాప్తంగా 29 జలాశయాలను ఎంపిక చేశారు. తొలుత రెండు జలాశయాల్లో పూడికతీత విజయవంతమైతే పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని ఎల్లంపల్లి, ఎగువమానేరులోనూ ఈ ప్రక్రియనే అనుసరించనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని మానేరు వాగులో నిర్మాణాలకు ఉపయోగించే నాణ్యమైన ఇసుక లభ్యమవుతుందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. తాగు, సాగునీటి అవసరాలకు 1985లో 24 టీఎంసీల సామర్థ్యంతో దిగువమానేరు, 2018లో 27.50 టీఎంసీల సామర్థ్యంతో మధ్యమానేరు జలాశయాల నిర్మాణాలు జరిగాయి. వీటి నిర్మాణంలో చాలా గ్రామాలు ముంపునకు గురయ్యాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గినప్పుడు తాగునీరు రంగు మారడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఈ జలాశయాల్లోని నీటి నమూనాలను పరీక్షించారు. ఇసుకతోపాటు అధిక మొత్తంలో మట్టి, పూడిక, గ్రావెల్ ఉన్నట్లు గుర్తించారు. దిగువ మానేరులో 20.78 టీఎంసీలు, మధ్యమానేరులో 22.34 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సామర్థ్యం తగ్గితే అవసరమైతే రెండు జలాశయాలకు ఎస్సారెస్పీ నుంచి తరలించే అవకాశం ఉంది. నీటి తరలింపు, వాడకంలో ఎలాంటి ఆటంకాలు ఎదురవకుండా జలాశయాల మధ్యలోకి యంత్రాలను పంపించి అందులోని వ్యర్థాలను బయటకు తీస్తారు. ఇలా వచ్చిన పూడిక నుంచి ఇసుకను వేరు చేస్తారు. దీనిలో నుంచి లభ్యమైన ఇసుక టన్నుకు రూ.406.64 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఈ మొత్తాన్ని పూడిక తీత పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ నీటిపారుదలశాఖకు చెల్లించాల్సి ఉంటుంది.

దిగువ మానేరులో 131 లక్షల టన్నులు, మధ్యమానేరులో 247 లక్షల టన్నుల పూడికను తీయనున్నారు. దీని నుంచి 25 శాతం మేరకు ఇసుక లభించే అవకాశాలు ఉన్నట్లు ఇంజినీర్ల అంచనా వేశారు. పూడికతీత ప్రాజెక్టును గుత్తేదారుకు 20 సంవత్సరాల పాటు అప్పగించనున్నారు.

# సాగునీటి సంఘాల పునరుద్ధరణకు సన్నాహం



జగిత్యాల : సాగునీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో 1996 రైతు యాజమాన్య చట్టం ప్రకారం చెరువుల కమిటీలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. 2010లో అప్పటి సాగునీటిసంఘాల పదవీకాలం ముగియగా ఎన్నికలు నిర్వహించకుండా 2014 వరకు పాత పాలకవర్గాలనే కొనసాగిస్తూ వచ్చారు. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు జరపకపోగా పూర్తిగా అధికారుల పర్యవేక్షణలోనే మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరద్ధరణ, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం, రోళ్లవాగు ఆధునికీకరణ, ఎల్లంపల్లి ఎత్తిపోతలు, గోదావరి నుంచి ఎత్తిపోతలు, వరదకాలువ, కాకతీయ కాలువల నుంచి చెరువుల్లోకి తూముల ఏర్పాటు, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణం తదితరాలను ప్రభుత్వం చేపట్టింది. దీంతోపాటు వేరువేరు అజమాయిషీలకిందగల ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, వరదకాలువ, జలవిద్యుత్తు ఉత్పత్తి, చిన్ననీటి పారుదలశాఖలు తదితరాలన్నింటినీ ఒకేశాఖగా ఏర్పాటుచేశారు. జగిత్యాలలో సీఈ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి అన్ని విభాగాల పనులను ఒకే గొడుగుకిందకు చేర్చారు.

చెరువులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల పాలకమండలి సభ్యులుగా రైతులే ఎన్నికవుతారు కాబట్టి స్థానిక నీటిపారుదలలోని సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించే వీలుంటుంది. స్థానికంగా మరమ్మతు, నీటిపారుదల అజమాయిషీ, అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ కాలువల చివరి భూముల వరకు నీటిని తరలించాలనేది సాగునీటి సంఘాల ప్రధాన విధులుగా ఉంటాయి. గతంలో చెరువులు, డిస్ట్రిబ్యూటరీలకు దాదాపు 122 వరకు సంఘాలుండేవి. ఉమ్మడి రాష్ట్రంలో ఆయకట్టు విస్తీర్ణం చాలా తక్కువగా ఉండగా ఇటీవల ఆయకట్టు విస్తీర్ణం పెరగటంతో సాగునీటి సంఘాల సంఖ్యను కూడా పెంచాల్సి ఉంది. నూతన ఎత్తిపోతల పథకాలు, కాలువలు, 100 ఎకరాలకన్నా తక్కువున్న చెరువులకు కూడా సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 250 వరకు ఏర్పాటయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రైతుల సంఖ్య కూడా 2.39 లక్షలకు పెరగటంతో వీరందరినీ ఆయా సాగునీటి సంఘాల్లో ఓటర్లు(సభ్యులు)గా నమోదు చేయాల్సిఉంది.

**రైతులకు ఉపయుక్తం**

సాగునీటి సంఘాలు ఉన్నప్పుడు తగిన నిర్వహణతో నీటిపారుదలలో ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. ఇటీవల కాలువలు, నిర్మాణాలు దెబ్బతినటంతో నీటిపారుదల కష్టంగా ఉంటోంది. సాగునీటి సంఘాల ఏర్పాటు రైతాంగానికి అత్యంత ఉపయుక్తంగా ఉంటుంది.

బొడ్డు లక్ష్మణ్, ఎస్సారెస్పీ కమిటీ మాజీ అధ్యక్షుడు

**అధికారులు, సిబ్బంది నియామకం**

రైతుల భాగస్వామ్యంతో సాగునీటి సంఘాల ఏర్పాటుపై ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలుంటాయి. సంఘాల పెంపు, సభ్యత్వ నమోదుపై ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఇటీవల ప్రభుత్వం నీటిపారుదశాఖలో అధికారులు, క్షేత్రసిబ్బంది పోస్టులను భర్తీచేసింది. టి.శ్రీనివాసరావుగుప్తా, ఎస్సారెస్పీ పర్యవేక్షక ఇంజినీర్

# పూర్తి చేస్తే ప్రయోజనం!



మంథని : పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లిలో 100, మండలంలోని కాకర్లపల్లి, ధర్మారం(బిట్టుపల్లి) గ్రామాల పరిధిలో 47 ఇళ్ల నిర్మాణాలను అట్టాహాసంగా ప్రారంభించింది. గుత్తేదారుల నిర్లక్ష్యంతో ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వాటిని పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో ఆశావహులకు ఎదురుచూపులే మిగిలాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ఇల్లు లేని పేదలకు ఇస్తే బాగుంటుంది. లేకపోతే ప్రజాధనం వృథా అవుతుంది.

**ముగ్గురు గుత్తేదారులు మారినా..:** మంథని మండలం కాకర్లపల్లి, ధర్మారం పరిధిలో 2018లో 47 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కాకర్లపల్లిలో 25 ఇళ్లకు.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.04 లక్షల అంచనా వ్యయంతో మొదలు పెట్టారు. ప్రారంభం నుంచి నేటికి ముగ్గురు గుత్తేదారులు మారారు. అయినా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు. స్లాబ్, గోడల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. అర్ధాంతరంగా పనులు నిలిపివేయడం, పర్యవేక్షణ లేక కొన్ని ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. ధర్మారం గ్రామ పరిధిలో 22 రెండు పడుక గదుల ఇళ్లను పిల్లర్ల వరకే నిర్మించారు. మంథని పరిధి కూచిరాజ్‌పల్లిలో 100 ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా.. మధ్యలోనే ఆగిపోయాయి. స్లాబ్ దశలో కొన్ని, పిల్లర్ల దశలో కొన్ని వదిలేశారు.

# తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి

శామీర్ పేట, ( గరుడ వార్త) : ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులను బాధ్యతాయుతంగా సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి శామీర్ పేట తహసిల్దార్ కు సూచించారు. శుక్రవారం శామీర్పేట తహశీల్దార్ కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల రెవెన్యూ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అలాగే రికార్డు రూమ్ ఎలా ఉందని, పనితీరు ఎలా ఉందని ఆయన క్షుణ్ణంగా పరిశీలి



ంచారు. మండలం లోని రెవెన్యూ రికార్డుల వివరాలను తహశీల్దార్ యాదగిరిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులను సక్రమంగా మేయింర్టెన్ చేయాలని, రెవెన్యూ ఫైళ్ళను పెండింగ్లో పెట్టకుండ ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అదనపు కలెక్టర్ తహశీల్దార్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈడిఎం శ్రావణ్, మండల డిప్యూటీ తహశీల్దార్ సంయుక్త, సిబ్బంది పాల్గొన్నారు.

# కాలుష్య తనిఖీలు అంతంతే!

కరీంనగర్ : ఉరుకుల పరుగుల జీవితాలు.. పెరుగుతున్న అవసరాలతో ఇంటికో వాహనం తప్పనిసరైంది. పెరుగుతున్న వాహనాలతో కాలుష్యం కూడా పెరుగుతోంది.. వాహనదారులు వాహనాల కాలుష్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించుకుని జాగ్రత్తలు తీసుకోవడానికి తనిఖీ కేంద్రాలున్నా ఎక్కువ శాతం వినియోగించుకోవడం లేదు.. దీంతో పరిమితికి మించి ఉద్గారాలు వెలువడుతున్నాయి.. మరోవైపు పోలీసులు, రవాణాశాఖ అధికారులు కూడా వాహన కాలుష్యం తనిఖీ ధ్రువపత్రాలపై దృష్టి పెట్టడం లేదు..

గతేడాది జనవరి ఫిబ్రవరి నెలల్లో కరీంనగర్, గోదావరిఖని పట్టణాల్లో గాలి నాణ్యత సూచీ 100ను దాటిందని కాలుష్య నియంత్రణ మండలి పరికరాల ద్వారా తేలింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం క్యూబిక్ మీటర్ గాలిలో సూక్ష్మ ధూళి కణాల (పీఎం 10) పరిమాణం 60 గ్రాములకు మించొద్దు.

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, గోదావరిఖనిల్లో మాత్రమే గాలి నాణ్యత సూచీ తనిఖీ పరికరాలు ఉన్నాయి. ప్రధాన పట్టణాల్లో ఉంటే పూర్తిస్థాయిలో గాలి నాణ్యత తెలిసే అవకాశం ఉంది.

**అంతా ఆన్‌లైన్...**

ఉమ్మడి జిల్లాలో 38 కాలుష్య తనిఖీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కొన్ని సంచార వాహనాలు, మరికొన్ని దుకాణాలు, పెట్రోలు బంకుల్లో ఏర్పాటు చేసినవి. వాహనాలను అక్కడికి తీసుకెళ్తే నిర్వాహకులు కాలుష్యం తనిఖీ చేసి ధ్రువపత్రాలు అందజేస్తారు. ఆన్‌లైన్ విధానం వచ్చిన తర్వాత ఉద్గారాలు పరిమితికి మించి ఎక్కువగా ఉంటే సర్టిఫికెట్



రాదు. తనిఖీ కేంద్రాల్లో వాహనాన్ని పరీక్షించిన అనంతరం అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. దీంతో ఆ పత్రం సెంట్రల్ సర్వర్‌కు వెళ్లడంతోపాటు ఆర్టీఏ ఎం వ్యాలెట్‌లో కూడా కన్పిస్తుంది.

**పరిమితి దాటితే మరమ్మతులు**

వాహనం నుంచి వెలువడే ఉద్గారాలు పరిమితికి మించి ఉంటే మరమ్మతులు చేయించాల్సి వస్తుంది. ఇంజిన్ ఆయిల్ మార్చడం, ఇంజిన్‌లో ఏవైనా మార్పులు వచ్చాయా పరిశీలించి మరమ్మతు చేయించి తీసుకెళ్లడం ద్వారా ఉద్గారాలు పరిమితి మించకుండా చూసుకుని ధ్రువపత్రం పొందొచ్చు.

**పరిశీలనకే పరిమితం..**

ఆర్టీఏ, పోలీసులు వాహన పత్రాలతోపాటు కాలుష్య తనిఖీ చేయిస్తున్నారా లేదా కూడా పరిశీలించాలి. కానీ వారు వాహన పత్రాల పరిశీలనకే పరిమితమవుతున్నారు.

**ఆసక్తి చూపని వాహనదారులు**

కాలుష్య పత్రం తనిఖీలు లేకపోవడంతో వాహనదారులు కూడా తమ వాహనాలకు క్రమం తప్పకుండా కాలుష్య తనిఖీ ధ్రువపత్రం తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. 15 ఏళ్లు నిండిన వాహనాలకు మాత్రం రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు కోసం తనిఖీ చేయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని సెంటర్‌లు ఆన్‌లైన్ కాకపోవడంతో ఇప్పటికీ కొందరు పాత యంత్రాల ద్వారా తనిఖీ చేస్తూ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. పాత వాహనాలకు ఆరు నెలలు ఇవ్వాల్సిన గడువును ఏడాదికి ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలుష్యం ఎక్కువగా ఉంటే ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ రాదు కాబట్టి వాహనదారుల అవసరాలను సొమ్ము చేసుకుంటూ అధిక డబ్బులు కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. కొత్త వాహనం కొనుగోలు చేస్తే కాలుష్యం తనిఖీకి ఏడాది గడువు ఉంటుంది. సంవత్సరం తర్వాత తనిఖీ చేయించుకుంటే సరిపోతుంది. బీఎస్–4, బీఎస్–6 వాహనాలకు అయితే ధ్రువపత్రం ఏడాది చెల్లుబాటు అవుతుంది. (2016 నవంబరు తర్వాత వచ్చినవి) బీఎస్–4, బీఎస్–6 కన్నా ముందు వాహనాలకు అయితే ధ్రువపత్రం ఆరు నెలలు మాత్రమే పనిచేస్తుంది.

# ఇళ్ల నిర్మాణం.. ఇక వేగవంతం

సారంగాపూర్ : ఇళ్లు లేని నిరుపేదలకు గూడు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు వేగవంతం చేస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలను ఎంపిక చేసుకొని ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆయా గ్రామాల్లో 1,628 ఇళ్ల మంజూరు కోసం ఎంపీడీవోలు కలెక్టర్‌కు పంపించగా 1,195 ఇళ్లకు అనుమతి ఇచ్చారు. ఒక్కో గ్రామంలో ప్రస్తుతం కనీసం 15 ఇళ్ల పనులు ప్రారంభించేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆయా నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అధికారులు ఇప్పటికే భూమిపూజచేసి పనులుప్రారం



భించారు.

**నమూనాల మాటేమిటి?**

మండలానికి ఒకటి చొప్పున నమూనా ఇంటి నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. 18 మండలాల్లో మండల పరిషత్తు కార్యాలయాల్లో నిర్మాణాలు చేపట్టారు. రూ.5 లక్షలతో నిర్మించే నమూనా ఇళ్లు ప్రస్తుతం ఆయా కార్యాలయాల్లో పునాదుల దశలోనే ఉన్నాయి.

ఓ వైపు లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తుండగా, ప్రభుత్వం నిర్మిస్తున్న నమూనా ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిర్మిస్తున్న నమూనా ఇంటి నిర్మాణం పూర్తయితే తక్కువ వ్యయంతో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రానున్నారు. అయితే అధికారులు కార్యాలయాల్లో నిర్మించే నమూనా ఇళ్లే ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరోవైపు గతంలో రెండు పడకగదుల నిర్మాణానికి మండలానికి ఒకటి చొప్పున నమూనా ఇల్లు నిర్మించగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. మండల పరిషత్తు కార్యాలయాల్లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో తక్కువ వ్యయంతో వీటిని నిర్మించారు. ఆ తర్వాత రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో నమూనా ఇళ్లు నిరుపయోగంగా మారాయని.. వీటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా అధికారులు చూడాల్సిన అవసరముందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వ్యర్థం.. శుద్ధీకరణతో అర్థం



కోరుట్ల: స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0లో భాగంగా చెత్త రహిత పట్టణ సాధనకు కోరుట్ల పురపాలిక శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో డంపింగ్‌యార్డులను ఖాళీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా బయోమైనింగ్ కార్యక్రమం చేపట్టాయి. 2026 నాటికి చెత్త రహిత పట్టణాలుగా మార్చాలనే లక్ష్యంతో బయోమైనింగ్ ద్వారా వ్యర్థాల శుద్ధీకరణను అమలు చేస్తూ సేంద్రియ ఎరువు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే కార్యక్రమాన్ని చేపట్టాయి.

**65,103 మెట్రిక్ టన్నులు..**

కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్‌లో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్‌యార్డు ఉంది. ఇక్కడ సుమారు 65,103 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోయాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.2.37 కోట్లతో బయోమైనింగ్ ప్లాంట్‌ను పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా జూన్ 2024లో ప్రారంభించారు. 2026 నాటికి వ్యర్థాలను శుద్ధీకరించి కోరుట్లను చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని ఈ కార్యక్రమాన్ని వేగంగా చేపడుతున్నారు.

ఇప్పటి వరకు 26,802 ఎంటీఎస్ వ్యర్థాలను శుద్ధీకరించారు. ఇందులో 10,878 ఎంటీఎస్‌ల సేంద్రియ ఎరువు (బయోఎర్త్) తయారైంది. 715 ఎంటీఎస్‌ల ప్లాస్టిక్ కవర్‌ను వేరు చేశారు. 6,377 ఎంటీఎస్‌ల ఇటుకలు, ఇనుప చువ్వలు, పాదరక్షలు, వస్త్రాలు, ఇతర వ్యర్థాలను వేరుగా బయటకు తీశారు.

ప్రభుత్వం రెండేళ్ల ఒప్పంద కింద బయోమైనింగ్ ప్లాంట్ నిర్వహణను అన్నపూర్ణ కన్‌స్ట్రక్షన్ జేవీ హిందో అగ్రో అండ్ కెమికల్స్ వారికి అప్పగించింది. వారు రెండేళ్లలోపు వ్యర్థాలను శుద్ధీకరించి ఖాళీ స్థలాన్ని అప్పగించాలని నిర్ణయించారు.

ఇప్పటివరకు 40 శాతం వ్యర్థాల శుద్ధీకరణ పూర్తయిందని.. చెత్త రహిత పట్టణ సాధనకు అధికారులు, సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ బట్టు తిరుపతి పేర్కొన్నారు.

ప్రక్రియ సాగుతోందిలా.. బయోమైనింగ్‌లో భాగంగా ముందుగా చెత్త కుప్పలను బెడ్లుగా విభజించి బయోకల్చర్ స్ప్రే పిచికారీ చేస్తున్నారు. మూడు నెలలకు చెత్త బెడ్‌లను జేసీబీ ద్వారా తవ్వి తీసి ప్రత్యేక యంత్రాల ద్వారా వివిధ దశల్లో శుద్ధీకరణ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా చెత్త నుంచి సేంద్రియ ఎరువు ఒకవైపు, మరోవైపు ప్లాస్టిక్ కవర్‌ల వ్యర్థాలు, మరోవైపు శుద్ధికాని ఇనుప ముక్కలు, చెప్పులు, వస్త్రాలు, ఇటుకలు, పెద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు.. ఇలా మూడు వైపులా వేరు చేస్తున్నారు. వ్యర్థాల శుద్ధీకరణ ద్వారా ఇప్పటివరకు వేరుచేసిన 715 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ కవర్‌లను మహారాష్ట్రలోని సిమెంట్ కార్మాగారానికి తరలిస్తున్నారు. 10,878 ఎంటీఎస్‌ల సేంద్రియ ఎరువును ప్రత్యేకంగా నిల్వ చేశారు. ఇది పంటలకు వినియోగించవచ్చో లేదోనని హనుమకొండలోని ల్యాబ్‌కు పరీక్ష కోసం పంపించారు. ఈ సేంద్రియ ఎరువును హరితహారంలో నాటిన మొక్కలకు ఎరువుగా వినియోగిస్తున్నారు.

# 'ఏరు'కోరి వస్తే మస్తు మజా!

భద్రాచలం : 'ఏరు' ఉత్సవం.. ఊరు, నీరు, కొండకోనల పరిమళాలను వెదజల్లుతోంది.. 'ప్రకృతిని ఆస్వాదించాలి.. కాపాడాలి' అనే సందేశాన్ని చాటిచెబుతోంది.. భద్రాచలం మన్యంలో ఎంపిక చేసిన ప్రాంతాలను ఏరు మహోత్సవంలో చేర్చటంతో పర్యాటకులకు ఈ యాత్ర మానసికోల్లాసాన్ని కలిగిస్తోంది. పల్లెల్లోని సహజసిద్ధమైన వనరులు, సంస్కృతి, సంప్రదాయాలను నేటితరానికి తెలియజెప్పేందుకు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈఏడాది జనవరి 10న ఏరు ఉత్సవాన్ని ప్రారంభించారు.

**ఆకర్షణీయ ప్యాకేజీలు**

తొలుత ఆర్భాటంగా ప్రచారం సాగించటంతో ఆధ్యాత్మిక-పర్యాటక అభివృద్ధికి వేగంగా అడుగులు పడతాయని అందరూ భావించారు. మూడు రోజుల ప్యాకేజీ కింద కనకగిరి గుట్టలు, బొజ్జిగుప్ప పర్యటనతో పాటు భద్రాచలం కుటీరాల బసకు కలిపి ఒక్కొక్కరికి ధర రూ.6వేలు



నిర్ణయించారు. ఈ మూడు ప్రాంతాలకు వెళ్లటం అందరికీ కుదిరే పనికాదు. కొంతమంది పర్యాటకులు ఒక్కరోజు కంటే ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. దీనిపై సమాలోచనలు జరిపిన అధికారులు ఒక్కరోజుకు గాను ఆకర్షణీయమైన ప్యాకేజీలను ప్రకటించారు.

**చూడాల్సిన ప్రదేశాలు**

చంద్రుగొండ మండలం బెండాలపాడులోని కనకగిరి కొండలు భూలోక స్వర్గంలా అనిపిస్తున్నాయి. బెండాలపాడు కుటీరాల్లో శనివారం రాత్రి బస చేయవచ్చు. ఆదివారం ఉదయం ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తూ కనకగిరి కొండ వ్యూ పాయింట్‌కు చేరుకుని అటవీ పచ్చదనాన్ని చూస్తే మురిసిపోవాల్సిందే. ఆదివాసీ కళాకృతులను వీక్షించవచ్చు. ఒక్కరోజు యాత్రకు ఒక్కొక్కరు రూ.2వేలు చెల్లించాలి. కొత్తగూడెం నుంచి బెండాలపాడు వరకు రవాణా, రాత్రి బస, గిరిజన నృత్యం, క్యాంప్ ఫైర్, భోజన సౌకర్యం ఈ ప్యాకేజీలో భాగం.

దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పలో 'ట్రైబల్ ఈవెనింగ్' వేడుక సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. పంటపొలాలు, ఆదివాసీల ఆవాసాలు, ఆహార అలవాట్లను పరిశీలించవచ్చు. క్యాంప్ ఫైర్, రేలా నృత్యప్రదర్శన ఉంటాయి. సరదాగా విల్లు ఎక్కుపెట్టి బాణాలను గురిచూసి కొట్టవచ్చు. రాత్రి రుచికరమైన భోజనం వడ్డిస్తారు. పెద్దలకు రూ.1,000, పిల్లలకు రూ.600. నాన్‌వెజ్‌కు రూ.100 అదనం. బస సదుపాయం లేదు.

భద్రాచలం గోదావరి గట్టుపై కుటీరాలు ఆహ్లాదం పంచుతాయి. సెల్ఫీ పాయింట్‌లో గోదావరి అందాలను బంధించవచ్చు. రాత్రి బసకు పెద్దలకు రూ.500. వేడి నీళ్లు, సోలార్ విద్యుద్దీపాల వెలుగులు, క్యాంప్ ఫైర్ ఉంటాయి. భోజనం కావాలంటే ఆర్డర్‌పై తీసుకొస్తారు.

భద్రాచలం ఐటీడీఏ మ్యూజియంలో ఆదివాసీ గృహోపకరణాలతో పాటు ఆయుధ సామగ్రిని చూడవచ్చు. ఈప్రాంగణంలో ఆదివాసీ ఆవాసాలు, ఓపెన్ జిమ్ ఉన్నాయి. పర్యాటకులు కిన్నెరసాని బోట్ షికార్‌తో పాటు పర్ణశాల వంటి ప్రాంతాలను దర్శించుకోవచ్చు.

ఇప్పటి వరకు సందర్శించిన పర్యాటకులు

దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్ప ఆదివాసీ గ్రామం: 30 మంది

కనకగిరి గుట్ట ట్రెక్కింగ్: 14 మంది (మరో 120 మంది త్వరలో వచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేయించారు)

భద్రాచలం గోదారి గట్టు కుటీరాలు: 75 మంది

ఫ్లెక్సీల ఏర్పాటుతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా ఏరు ఉత్సవానికి ముమ్మర ప్రచారం కల్పిస్తున్నాం. పర్యాటకుల అభిప్రాయాలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

వెంకటేశ్వర్లు, క్యాంప్ ఇన్‌ఛార్జి

# ఉపాధి ఖరారు



కరీంనగర్: ఉన్న ఊళ్లో ఉపాధిని అందించే పనులను ఎంపిక చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి మొక్కుబడిగా పని దినాలను ఎంపిక చేయడంతో ఈసారి తక్కువ పనే దిక్కవుతోంది. పక్కాగా ఉపాధి హామీని అందిస్తామనే ఆశయం క్రమంగా అటకెక్కుతోంది. ఇటీవల నాలుగు జిల్లాల పరిధిలో గ్రామసభలను నిర్వహించిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏఏ పనులను చేపట్టాలనే విషయమై అంచనాలను రూపొందించారు. కరోనా విపత్తు తరువాత క్షేత్రస్థాయిలో అనుకున్న విధంగా పనులను గుర్తించకపోవడంతో ఈ ఉపాధి మీదనే ఆధారపడ్డ పేద కుటుంబాలకు నష్టం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ ప్రణాళిక విషయంలో పక్కాగా పర్యవేక్షణ చేపట్టకపోవడంతో ఈసారి కూడా జాబ్‌కార్డు ఉన్న వారిలో ఎక్కువ మందికి వంద రోజుల పని అందడమనేది గగనమే.

**చిన్న చిన్న పనులే..**

గ్రామం యూనిట్‌గా పనుల ఎంపిక విషయంలో ముందు చూపు కనబడలేదు. ఈసారి కూడా గుంతలు తీయడం, చిన్న నీటి కాలువల పనులు, మట్టి రోడ్లు, సాగు భూముల్లో కందకాలు, ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు, పశువుల షెడ్ల నిర్మాణం లాంటి చిన్నచిన్న పనుల కోసమే పని దినాలకు అంచనాలు రూపొందించారు. గ్రామంలో ఇంకా వ్యవసాయ అనుబంధంగా ఉన్న పనులను పెద్ద మొత్తంలో గుర్తించే వీలుండేది. పైగా సర్పంచుల పదవీ కాలం ముగియడంతో అధికారులు గ్రామసభలను మమ అనిపించారు. దీంతో జాబ్‌కార్డు ఉన్నా ఉపయోగం లేని పరిస్థితి. ప్రస్తుత అంచనా ప్రకారం ఏడాదికి 1.26 కోట్ల పని దినాలు కల్పిస్తారు. ఈ లెక్కన రోజుకు సగటున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34,543 మందికి మాత్రం పని అందుతుంది. ఉమ్మడి జిల్లాలో 3,27,232 మందికి జాబ్ కార్డులుండగా 4,93,852 మంది కూలీలున్నారు. ఇందులో 60శాతం కూలీలు క్రమం తప్పకుండా పనికి వెళ్తుంటారు. ఇలాంటి వారికి పని అందించాలన్నా దాదాపుగా 1.60కోట్ల పనిదినాలు కల్పిస్తే ఓ మోస్తరుగా కూలీలకు దినసరి వేతనం అందేది. ప్రతి ఏడాది ఎంత లక్ష్యాన్ని నిర్ణయించుకున్నా.. అందులో 95-98 శాతం పనులు మాత్రమే జరుగుతున్నాయి.

# 41 రోజులు.. 14.5 మిలియన్ టన్నులు



గోదావరిఖని: ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి 41 రోజుల సమయమే ఉండగా.. బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో సింగరేణి వెనుకంజలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 57.50 మిలియన్ టన్నులు వెలికితీశారు. నిర్దేశిత వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా 14.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాలి. ప్రస్తుతం రోజుకు 2.2 లక్షల టన్నుల వరకు మాత్రమే బొగ్గును తవ్వుతున్నారు. ఇది 3లక్షల టన్నులకు చేరితేనే లక్ష్యం నెరవేరుతుంది. మొదటి నుంచి లక్ష్యాన్ని అధిగమించేందుకు కసరత్తు చేస్తున్నా నెలవారీ లక్ష్యాలను అందుకోలేకపోతోంది.

**అందుబాటులోకి రాని నైనీ** ఈ ఏడాది అందుబాటులోకి వస్తుందనుకున్న ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకును కలుపుకొనే సింగరేణి వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించింది. పనులు పూర్తి కాకపోవడంతో నైనీ బొగ్గు బ్లాకులో ఉత్పత్తి ప్రారంభం కాలేదు. దీంతో పాటు కొన్ని ఉపరితల గనుల విస్తరణ పనులకు అడ్డంకులు రావడం.. ప్రస్తుత ఓసీపీల్లో ఆశించిన స్థాయిలో బొగ్గు ఉత్పత్తి కాకపోవడం లక్ష్యంపై ప్రభావం పడింది. ఇల్లెందు, అడ్రియాల ప్రాజెక్టు మినహా మిగతా డివిజన్‌లు వంద శాతం బొగ్గు ఉత్పత్తిని అందుకోలేకపోయాయి.

**అందిపుచ్చుకోని ప్రోత్సాహక పథకం**

బొగ్గు ఉత్పత్తి పెంచేందుకు యాజమాన్యం కార్మికులకు ప్రోత్సాహక పథకాన్ని ఈ నెల నుంచి మార్చి 31 వరకు అమలు చేస్తుంది. ఉత్పత్తి లక్ష్యాలు సాధించిన గనులు, ఏరియాల వారిగా కార్మికులకు నగదు ప్రోత్సాహకం అందించనుంది. నెలకు 22 హాజర్లు తప్పనిసరిగా ఉండటంతో పాటు వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన గని, డివిజన్‌లో పనిచేసే ఉద్యోగులకు ఈ పథకం అమలు చేస్తారు. అయితే ఈ పథకాన్ని అందిపుచ్చుకోవడంలో కార్మికులు ఉమ్మడిగా విఫలమయ్యారు.

**సీఎండీ దిశా నిర్దేశం**

ఇటీవల సింగరేణి వ్యాప్తంగా పర్యటించిన సీఎండీ బలరాం కార్మికుల్లో బొగ్గు ఉత్పత్తి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. వార్షిక లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న బొగ్గు డిమాండ్‌కు అనుగుణంగా లక్ష్యాలను చేరుకునే విధంగా ఎవరికి వారు పనిచేయాలని వివరించారు.

# పన్నులకు తగ్గ పనులేమీ..?

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈసారి పంటల పరిస్థితి ఆశాజనకంగా లేదు. దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ ప్రభావం మార్కెటింగ్‌శాఖ ఆదాయంపై పడే అవకాశముంది. మార్చి ఆఖరు నాటికి మార్కెట్లు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాల్సి ఉండగా ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించటం లేదు. ఖమ్మం మార్కెట్‌పైనే మార్కెటింగ్‌శాఖ ఆశలు పెట్టుకుంది. మిరప సీజన్ జోరుగా ఉండటం వల్ల ఆదాయం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్లకు వచ్చే, చెక్‌పోస్టుల ద్వారా వ్యాపారులు తరలించే పంట ఉత్పత్తులపైన మార్కెటింగ్‌శాఖ 1% సెస్ వసూలుచేస్తుంది. ఇలా ఏటా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం లభిస్తున్నప్పటికీ అనేక వ్యవసాయ మార్కెట్లలో సౌకర్యాలు అంతంతమాత్రంగానే దర్శనమిస్తుండటం గమనార్హం.

పరిష్కరించాల్సిన సమస్యలు.. సమకూర్చాల్సిన వసతులు

దళారీ వ్యవస్థను నిర్మూలించాలి.

ప్రతి రైతుకు తప్పకుండా తక్‌పట్టీ ఇవ్వాలి.

గ్రామాల నుంచి సరకుతో వచ్చే ఆటోలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. అన్నదాతలకు శౌచాలయాలు నిర్మించాలి. తాగునీటి సౌకర్యం ఉండాలి. రైతులకు అల్పాహారం అందించేందుకు మార్కెట్లలో క్యాంటీన్లు ఏర్పాటుచేయాలి. రూ.5కే భోజనం అందించాలి.

మార్కెట్ ధరలను నిరంతరం డిజిటల్ బోర్డులపై ప్రదర్శించాలి. ఇతర మార్కెట్లలో ధరలను రైతులకు తెలియజేయాలి.

మార్కెట్లలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఉండాలి.

మార్కెట్లకు అనుబంధంగా ఉండే 'ఏరువాక' కేంద్రాలను పునరుద్ధరించాలి. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు శాస్త్రవేత్తలను అందుబాటులో ఉంచాలి.

గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే రోడ్ల కోసం ప్రత్యేకంగా మార్కెట్ కమిటీ నిధులు కేటాయించాలి.

ఈ సంవత్సరం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధిస్తాం. భారత పత్తి సంస్థ (సీసీఐ), పౌరసరఫరాల శాఖ నుంచి బకాయిలు రావాల్సి ఉంది. మార్చి ఆఖరు నాటికి వచ్చే ఆదాయంతో లక్ష్యాన్ని అధిగమిస్తాం. మార్కెట్ల వద్ద నిఘా పెంచాం. దీనివల్ల ఆదాయం మరింత పెరుగుతోంది. మార్కెట్లలో వసతుల కల్పనపైనా దృష్టి సారిస్తాం.

ఎంఏ అలీం, డీఎంఓ, ఖమ్మం

# మాడవీధుల విస్తరణకు నిధుల గండం..!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం మాడవీధుల విస్తరణకు నిధుల గండం పొంచి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారుల వద్ద డబ్బులు ఉంటే ఈపాటికే పరిహారంపై స్పష్టత వచ్చేదనే ప్రచారం సాగుతోంది. కొన్నేళ్ల క్రితం రామాలయం అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక రూపొందించారు. ఇది అమలుకావాలంటే ముందుగా మాడవీధులను విస్తరించాలి. ఇందుకోసం 46 ఇళ్లను తొలగించి ఎకరం స్థలాన్ని దేవస్థానానికి అప్పగించాలి. ఈమేరకు ఇంజినీరింగ్ నిపుణులు, స్థపతులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇళ్లు కోల్పోయే వారికి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన స్థలాన్ని కేటాయించేందుకు చర్చలు జరిపారు. పది మంది నిర్వాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మరోసారి వీరితో చర్చించి పరిహారం అందించటమే మిగిలింది.



**ఉత్తర్వులు వెలువడినా..**

కొద్ది నెలల క్రితం రూ.60.20 కోట్లను మాడవీధుల విస్తరణకు మంజూరు చేస్తున్నట్లు జీఓ వెలువడింది. ఉత్తర్వులు వచ్చినా డబ్బులు సంబంధిత ఖాతాకు జమకాలేదని తెలిసింది. క్షేత్రస్థాయి పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు ఇక్కడి అధికారులు సమాచారమందించారు. ఇంకా నాన్చితే పనులు జాప్యమయ్యే వీలుంది. మార్చి 14న కల్యాణ తలంబ్రాలను కలిపి పసుపు కొమ్ములు దంచి శ్రీరామనవమి పనులు ప్రారంభిస్తారు. మార్చి 30న బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి. ఏప్రిల్ 6న శ్రీరామనవమి, 7న పట్టాభిషేకం వేడుకలు జరుగుతాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వీలైనంత తొందరగా మాడవీధులకు అవసరమైన స్థలాన్ని స్వాధీనపరచుకుంటే శ్రీరామనవమికి వచ్చే భక్తులకు విశాలమైన ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించవచ్చు. మంజూరైన నిధులతో మాడవీధులకు అవసరమైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. దామోదర్‌రావు, ఆర్డీఓ

# లక్ష్యసాధనకు మిగిలింది 41 రోజులే..!

కొత్తగూడెం : బొగ్గు ఉత్పత్తి సంవత్సరం పూర్తయ్యేందుకు ఇక 41 రోజులు మాత్రమే మిగిలింది. ఇప్పటికే అధికారుల్లో లక్ష్యసాధన కోసం ఆందోళన మొదలైంది. బొగ్గు అధికోత్పత్తి కోసం ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. బొగ్గు ఉత్పత్తి సంవత్సరం ఏప్రిల్‌తో మొదలై మార్చితో ముగుస్తుంది. సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఈనెల 17న అన్ని ఏరియాల జీఎంలతో సమీక్ష నిర్వహించి సాధించాల్సిన లక్ష్యాలపై సమీక్షించారు. అన్ని గనుల్లో అధికోత్పత్తి కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఉ



త్పత్తి పెంచాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రారంభించాల్సిన గనులు సమయానికి మొదలుకాకపోవడంతో ఉత్పత్తి లక్ష్య సాధన కష్టతరంగా మారిన అంశాన్ని ప్రస్తావించారు. వాతావరణం అనుకూలంగా ఉందని, ఇలాంటి పరిస్థితులను సద్వినియోగం చేసుకొని ఉపరితల గనుల్లోని భారీ యంత్రాల సాయంతో అధికోత్పత్తి సాధించాలని సూచించారు.

**రోజుకు 2.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి**

ఈ వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు రోజూ 2.60 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రోజుకు సగటున 2.05లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతోంది. మరో 55వేల టన్నుల బొగ్గును అదనంగా ఉత్పత్తి చేయాల్సి ఉంది.

# ఆదాయ మార్గాలున్నా.. అందిపుచ్చుకోరేమన్నా?



హైదరాబాద్: కళ్లెదుట ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ దృష్టి పెట్టడంలో హెచ్ఎండీఏ విఫలమవుతోంది. తీరా అభివృద్ధి పనుల కోసం నిధులు కొరత ఎదుర్కొంటోంది. హెచ్ఎండీఏ పరిధి 7 జిల్లాల్లో విస్తరించింది. ప్రధాన నగరంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు ఉన్నాయి. ఇక్కడ పలు ఆస్తులు హెచ్ఎండీఏనే నిర్వహిస్తోంది. ప్రస్తుతం లేఅవుట్లు, భవనాల అనుమతులు, అద్దెల రూపంలో నెలకు రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అయితే ఇతరత్రా ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ వాటిని అంది పుచ్చుకోవడంలో అధికారుల తాత్సారం కన్పిస్తోంది. దీంతో నెలకు మరో రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు అదనపు ఆదాయం కోల్పోతోంది. తీరా అభివృద్ధి కార్యక్రమాల నిధులకు ప్రభుత్వం వైపు చూడాల్సి వస్తోంది. కొన్ని ప్రాజెక్టులకు అప్పుల కోసం తిప్పలు పడుతున్నారు. స్థిరమైన ఆదాయం ఉంటే నిధులను సమకూర్చుకునే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్ష చేసి...క్షేత్రస్థాయి పరిస్థితులపై అంచనా వేసే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు.

**అందుబాటులో ఉన్న స్థలాలు..**

సరోజినిదేవి నేత్ర ఆసుపత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు దాదాపు 11 కిలోమీటర్ల పీవీ ఎక్స్‌ప్రెస్‌వే కింద 300 పైనే పిల్లర్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఐమ్యాక్స్ పక్కన గ్రౌండ్.. సరైన మార్కెటింగ్ లేక ఒక్కోసారి ఖాళీగా ఉంటోంది. ఈ గ్రౌండ్ పక్కనే ద్విచక్ర వాహనాలు, కార్లు నిలిపే స్థలానికి ఒక గుత్తేదారు రూ.లక్షల్లో బకాయి పెట్టి ఉడాయించడంతో అప్పటి నుంచి ఖాళీగా పెట్టారు. లుంబినీపార్కులో గతంలో హెచ్ఎండీఏ హోటల్‌ను లీజుకిచ్చి ఆదాయం పొందేది. అయితే హోటల్ నిర్వాహకులు సైతం రూ.లక్షల్లో బకాయిలు పడి జారుకున్నారు. ప్రస్తుతం ఈ రెస్టారెంట్ ఖాళీగా ఉంది. ఇక ఐమ్యాక్స్ ఎదురుగా ఖరీదైన స్థలం ఏడాదిన్నరగా స్థలం ఖాళీగా ఉంది. ఓ నేత కన్ను పడి కమ్యూనిటీ హాలు నిర్మించాలని దరఖాస్తు పెట్టుకుంటే హెచ్ఎండీఏ తిరస్కరించింది. నెక్లెస్ రోడ్డులో పలు ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు హెచ్ఎండీఏ అద్దెకు ఇస్తోంది. అయితే కొన్నింటిని నామమాత్రపు అద్దెలకు కొనసాగిస్తోంది. కొందరైతే బకాయిలు పడి వాటిని చెల్లించడం లేదు. ఎన్టీఆర్ గార్డెన్ వద్ద గతంలో వాహనాలు నిలుపుదల కోసం లీజుకు ఇచ్చారు. అయితే అద్దెదారు బకాయిలను ఎగవేయడంతో ఖాళీగా ఉంది. సంజీవయ్య పార్కులో ఒకవైపు రూ.లక్షలు ఖర్చు పెట్టి పార్టీ జోన్ రూపొందించారు. పెళ్లిళ్లు, పుట్టినరోజులు, పండగలకు అద్దెకిచ్చేవారు. కరోనా తర్వాత పట్టించుకోవడం లేదు. నగరం చుట్టూ 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లు హెచ్ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. అక్కడ హోర్డింగ్‌లు పెట్టొచ్చు. 5 జిల్లాల్లో 1000 ఎకరాలకుపైగా భూములున్నాయి. వీటిని ఖాళీగా పెట్టకుండా ఆదాయ మార్గాల వైపు మళ్లించాలి.

## జంక్షన్ లో ఆగేదెలే

కూకట్‌పల్లి : కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తొలగించేందుకు వేర్వేరు చోట్ల రెండు వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇప్పటికే నిధులు విడుదల చేయడంతో.. ఆ దిశగా అధికారులు పనిలో నిమగ్నమయ్యారు. ముందుగా స్థల సేకరణ చేయాలని నిర్ణయించగా.. అధికారుల బృందం ఆయా ప్రాంతాలను సందర్శించింది.

రంగధాముని చెరువు రోడ్డు సమీపంలో.. మూసాపేట- కూకట్‌పల్లి మార్గంలో అశోక వన్ మాల్ నుంచి కూకట్‌పల్లి ఠాణా దాటే వరకు మరో వంతెన నిర్మించనున్నారు. మధ్యలో రంగధాముని చెరువు రోడ్డు(ఐడీఎల్) దాటి వంతెన వెళ్తుంది. హైటెక్‌సిటీ, ఐడీఎల్ రోడ్డులోకి వెళ్లే వాహనాలన్నీ వంతెన కింది నుంచి వెళ్లాయి. తద్వారా ఇక్కడ ట్రాఫిక్ విభజన అవుతుంది వంతెనల నిర్మాణానికి స్థల సేకరణ దిశగా



ఏర్పాట్లు ప్రారంభించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**బాలానగర్, మూసాపేట స్టేషన్ల మధ్య**

కూకట్‌పల్లి వై జంక్షన్‌లో సిగ్నల్ పడిన కొన్ని సెకన్లలోనే మూడు వైపులా వాహనాలు బారులుతీరుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే కృష్ణారావు వినతితో జంక్షన్ అభివృద్ధితోపాటు వంతెన నిర్మాణానికి సర్కారు ఆమోదం తెలిపింది. కూకట్‌పల్లి నుంచి మూసాపేట వైపు వెళ్లే వాహనాలన్నీ వంతెన పైనుంచి వెళ్లేలా బాలానగర్, మూసాపేట మెట్రోస్టేషన్ల మధ్యలో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు.

## చెరువుకు జీవం.. చేపకు ప్రాణం

హైదరాబాద్: ఆక్రమణల నుంచి చెరువులకు విముక్తి కల్పించడం మాత్రమే కాదు.. వ్యర్థాలను తొలగించి జలవనరులకు పునరుజ్జీవనం కల్పించే చర్యలకూ హైడ్రా శ్రీకారం చుట్టింది. మొదటి దశలో కూల్చివేతలు పూర్తయిన ఆరు చెరువుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే అంబర్‌పేట బతుకమ్మకుంట, ఉప్పల్ నల్లచెరువు, కూకట్‌పల్లి నల్లచెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్‌నుద్దౌలా చెరువుల్లో మురుగు బయటకు తరలించే పనులు మొదలయ్యాయి. రూ.80కోట్ల హెచ్ఎండీఏ నిధులతో త్వరలోనే అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తామని హైడ్రా స్పష్టం చేస్తోంది.

**ఆరు చెరువులు ఇవే..:** అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్‌రుక్‌నుద్దౌలా చెరువు, మాదాపూర్‌లోని తమ్మిడికుంట, గుట్టలబేగంపేటలోని సున్నం చెరువు, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు



**జలచరాలకు ఆలవాలం..:** మురుగును సహజసిద్ధంగా వడపోసే మూడు సెడిమెంటేషన్ ప్లాంట్లను ప్రతి చెరువులో ఏర్పాటు చేస్తామని, తద్వారా బయటి నుంచి తటాకంలోకి వచ్చే నీరు శుద్ధి అవుతుందని, తద్వారా చేపలు, ఇతరత్రా జలచరాలకు ఆలవాలంగా తీర్చిదిద్దుతామని హైడ్రా ధీమా వ్యక్తం చేస్తోంది.

**నాలుగు అడుగులు తవ్వగానే..** బతుకమ్మకుంటకు పునరుజ్జీవం కల్పించే పనుల్లో భాగంగా.. హైడ్రా పూడికతీత చేపట్టింది. నాలుగు అడుగులు తవ్వగానే నీరు ఉబికి వచ్చింది. ఈ క్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ యంత్రాంగంతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఎలాంటి పైపులైన్లు లేవన్నారు.

## తోడేస్తున్నారు.. అమ్మేస్తున్నారు



కందుకూరు : ఎండలు పెరగడంతో నీళ్ల వ్యాపారం జోరందుకుంది. కొందరు భూగర్భ జలాలు తోడేస్తూ ట్యాంకర్ల ద్వారా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా నీటి విక్రయాలు చేస్తున్నారు. రోజూ వందల ట్యాంకర్ల నీటిని పంట పొలాల నుంచి తోడేస్తున్నారు. దీంతో రైతుల పంటలు ఎండుతున్నాయి. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం..:** కందుకూరు మండలం లేమూరు పరిసరాల్లో ఓ రాజకీయ నాయకుడు రోజూ పొలాల్లో బోర్ల ద్వారా నీటిని ఓ గుంతలోకి తరలించి అక్కడ నుంచి ట్యాంకర్లతో తరలిస్తున్నాడు. ప్రతీ ట్యాంకర్ నీటిని రూ.1000-రూ.1200లకు విక్రయిస్తున్నాడు. గ్రామాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయని, నీటి అక్రమ రవాణాను నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

ఉచిత విద్యుత్తు దుర్వినియోగం..: ప్రభుత్వం వ్యవసాయానికి కల్పిస్తున్న ఉచిత విద్యుత్తు సదుపాయాన్ని అక్రమార్కులు నీటిని తోడేందుకు వినియోగిస్తున్నారు.

**అక్రమాలను అడ్డుకుంటాం..:** ఆరు నీళ్ల ట్రాక్టర్లను సీజ్ చేశాం.. బోర్ల ద్వారా భూగర్భ జలాలను తోడి విక్రయాలకు పాల్పడుతున్న అక్రమార్కులను అడ్డుకుంటాం. ఉచిత విద్యుత్తు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. గోపాల్, తహసీల్దారు, కందుకూరు

## ప్రకృతి వనం.. కళావిహీనం



తాండూరు: జిల్లాలో పల్లె, పట్టణ ప్రకృతి వనాలు నిర్వహణ లేక కళ తప్పుతున్నాయి. ఏపుగా ఎదిగిన చెట్ల బాగోగులను చూసే వారు లేక మోడు వారుతున్నాయి. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి సేద తీరేందుకు అనువుగా గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. ఆమేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఒక్కో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. ఇందు కోసం ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో వినియోగంలో లేకుండా ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయించింది. నిధులు నిలిచి పోవడంతో మొదలైన సమస్య: ఒక్కో ప్రకృతి వనం బాగోగులను చూసు కోవడానికి గ్రామీణ ఉపాధి హామీ ద్వారా ప్రత్యేకంగా ఒక్కో కూలిని నియమించారు. వనాల నిర్వహణకు నిధులు లేక పోవడంతో కూలీలు పనులు ఆపేశారు. దీంతో వనాలకు నీరు పట్టే వారు లేకుండా పోయారు. పెరిగే దశలో ఉన్న మొక్కలు ఎండి పోతున్నాయి. వృక్షాలు కూడా కళ తప్పాయి. పల్లె ప్రకృతి వనాల నిర్వహణను గ్రామ పంచాయతీలే చూసుకోవాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు.

**పట్టణాల్లోనూ అంతే..**

తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లోనూ పల్లె ప్రకృతి వనాల మాదిరిగానే పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం పట్టణ ప్రగతి కింద విడుదలైన నిధులను వినియోగించారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదకరంగా మారాయి. కొంత కాలం నుంచి పట్టణ ప్రకృతి వనాలను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. వనాల చుట్టూరా వేసిన కంచెలు దెబ్బతినడంతో పందులు, శునకాలు ఆవాసం ఏర్పర్చుకుంటున్నాయి. యంత్రాలకు అడ్డాగా.. కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ తండాలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలు లేకపోవడంతో రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ తన వాహనాలను దీన్లో నిలిపివేశారు. అంతేకాదు నిర్మాణ సామగ్రి పనులు కూడా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రకృతి వనాలను సంరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## సొంత స్థలానికే మొదటి ప్రాధాన్యం

కరీంనగర్ : గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిర మహిళా పథకం ద్వారా కట్టించి ఇచ్చేందుకు పకడ్బందీ విధానాన్ని అమలు చేస్తుంది. నిర్మాణానికి ముగ్గు పోసే సమయంలో తప్పకుండా పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వారు వచ్చి వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పనులు జరగడంలేదు. కోడ్ ఎత్తివేసిన వెంటనే పనులపై దృష్టి సారిస్తామని అధికారులు తెలిపారు. గ్రామాల్లో నిర్మాణాల అనంతరం పురపాలక, నగరపాలక సంస్థ పరిధిలో శ్రీకారం చుడతారు. అక్కడ లబ్ధిదారుల సర్వే సైతం పూర్తి చేశారు.

మొదటి విడతలో..సొంతంగా ఇంటి స్థలం ఉండి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నవారిని ఎల్-1 విభాగం కింద విభజించారు. వారు చూపిన స్థలాన్ని జియో ఫెన్సింగ్ చేశారు.

సొంత భూమి లేనివారితో ఎల్-2 జాబితా తయారు చేశారు. వారికి స్థలంతోపాటు నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తారు.

అద్దెకున్నవారు, సొంత ఇల్లు ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నవారిని ఎల్-3 జాబితాలో చేర్చారు.



పునాది తర్వాతే నిధులు

పునాది పనులు పూర్తయిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొదటి విడతగా రూ.లక్ష లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తారు. 400 చదరపు అడుగుల కంటే తక్కువ కాకుండా నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఇంటికి 8 ట్రాక్టర్ల ఇసుకను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి కూపన్లను తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందాల్సి ఉంటుంది.

## కీలక సమయం.. ప్రథమమే లక్ష్యం


తాండూరు : పదో తరగతి పరీక్షలకు ఇంకా నెల రోజులే గడువు.. ఈ సమయం ఎంతో కీలకం. అందుకనే అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు, తల్లిదండ్రులు నిత్యం కసరత్తు చేస్తున్నారు. ప్రత్యేకించి అధికారులు గతానుభవాల దృష్ట్యా (వరుసగా రెండేళ్లుగా అట్టడుగున నిలుస్తోంది) పది ఫలితాల్లో ఈ ఏడాది ప్రథమానికి చేరుకోవాలని విద్యా సంవత్సరం ఆరంభంనుంచే కృషి చేయడం ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రచించి బోధన చేయిస్తున్నారు. సమయం తక్కువ ఉండటంలో ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా మేలైన ఫలితాలను రాబట్టేందుకు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం..

ఇప్పటివరకు ఇలా చేశారు.

ఎప్పటికప్పుడు పునశ్చరణ.

వారం, పక్షం రోజులకోసారి పరీక్షల నిర్వహణ.

పరీక్ష విధానం, మార్కుల సాధనపై విద్యార్థులకు అవగాహన.



వసతి గృహాల్లో విద్యార్థులకు సైతం ప్రత్యేక ట్యూషన్లు.

ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ఏర్పాటు.

**ఆంగ్లం, గణితంపై ప్రత్యేక శ్రద్ధ..**

గడిచిన రెండేళ్ల జిల్లా పదోతరగతి ఉత్తీర్ణతలో చిట్ట చివర స్థానం నిలవడానికి ప్రధాన కారణమైన ఆంగ్లం, గణితం సబ్జెక్టులు కావడంతో ఉపాధ్యాయులు అప్రమత్తమయ్యారు. వీటి విషయంలో విద్యార్థులు ఎక్కడ పొరపాట్లు చేస్తున్నారో ఆదిలోనే గుర్తించారు. ఎప్పటికప్పుడు పరీక్షలు పెట్టి మెరుగుపడేలా సాధన చేయించారు. మెలకువలు నేర్పించారు.

ఉపాధ్యాయులు ఆరా తీస్తున్నారు

సంజయ్య, విద్యార్థి తండ్రి, తాండూరు

పరీక్షలయ్యే వరకు మా కుమారుడు వంశీకి ఇంటి, పొలం పనులు చెప్పకూడదని నిర్ణయించాం. ప్రతి రోజూ పాఠశాల ఉపాధ్యాయులు నాకు వీడియో కాల్ చేసి ఆరా తీస్తున్నారు.

ఈసారి మెరుగైన ఫలితాలు ఖాయం

రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి, వికారాబాద్.

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఈఏడాది మెరుగైన ఫలితాలు సాధించడం ఖాయం. ఎందుకంటే ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. వివిధ కారణాల వల్ల చదువులో వెనకబడిన వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక ప్రకారం చదివిస్తున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు.. 174

ఆదర్శ.. 9

కస్తూర్బా.. 19

మొత్తం విద్యార్థులు.. 14,380

ప్రభుత్వ.. 7,736

వీరిలో బాలురు.. 4,254

బాలికలు.. 3,482

## ఇదో రకం మామూళ్ల దందా!

అశ్వారావుపేట : ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇసుక అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులకు కలెక్టర్, ఎస్పీ సూచించారు. అయినా అశ్వారావుపేట మండలంలోని అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే అనుమానంతో జిల్లా అధికారులు ఇసుక అక్రమ దందాపై నిఘా పెట్టాలని స్పెషల్ బ్రాంచ్ పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. కొత్తగూడెం నుంచి వచ్చిన ఎస్పీ పోలీసులు అశ్వారావుపేట శివారులో తెల్లవారుజామున కాపు కాసి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.

**అక్రమార్కులకు వత్తాసు**

అనంతారం, నారాయణపురం, గుమ్మడవల్లి సమీపంలోని వాగుల నుంచి పగలూరాత్రీ అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. మామూళ్ల మత్తులో పడి అక్రమార్కులకు స్థానిక అధికారులు వత్తాసు పలుకుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు.. ఇసుకను



అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మొక్కుబడిగా వారానికి ఒకట్రెండు వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**భారీగా తరలింపు**

మూడు వాగుల నుంచి రోజూ సుమారు 100 ట్రక్కుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ కొందరు రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.3,500 నుంచి రూ.4వేల వరకు అశ్వారావుపేటలో విక్రయిస్తున్నారు. సత్తుపల్లి, ఖమ్మం, దమ్మపేట పరిసర గ్రామాలకు అక్రమంగా తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రక్కు ఇసుక ధర పెరుగుతోంది. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, పోలీసు, మైనింగ్‌శాఖ సిబ్బందితో బృందాలను ఏర్పాటుచేశాం. ఏ వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారో అక్కడ 24 గంటల పాటు నిఘా పెడుతున్నాం. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులపై ఆరోపణలు అవా స్తవం. కృష్ణప్రసాద్, తహసీల్దారు, అశ్వారావుపేట

# సౌర విద్యుత్ తయారీ ప్లాంట్లకు సై

హైదరాబాద్ : సౌర విద్యుత్ వినియోగాన్ని అన్ని జిల్లాల్లో పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెవెన్యూ అధికారులు ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేస్తున్నారు. ఒక్కో మెగావాట్ సౌరవిద్యుత్ ఉత్పత్తికి 4 ఎకరాల భూమి సేకరించాలన్న మార్గదర్శకాల మేరకు రెండు జిల్లా అధికారులు గ్రామాల్లో ప్రభుత్వ భూముల వివరాలను తీసుకున్నారు. ఎక్కువ జనాభా కలిగిన గ్రామాలు, మండల కేంద్రాల్లో ఈ ప్లాంట్లను ఏర్పాటుచేస్తే అక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, కోతలు ఉండబోవన్న ముందస్తుఅంచనాతో అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఈ ప్లాంట్ల వివరాలు, ప్రాంతాలు, అనుకూలతలను 2, 3 రోజుల్లో ప్రభుత్వానికి పంపించనున్నారు.

**నిరంతర సరఫరా.. పర్యావరణ హితం..**

గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే నిరంతర విద్యుత్ సరఫరాకు వీలుంటుందని రాష్ట్ర



ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విద్యుత్ తయారీలో ఇప్పటికీ సింహభాగం థర్మల్ విద్యుత్‌నే వినియోగిస్తున్నాం. పర్యావరణానికి ఇది హాని కలిగిస్తోంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించేందుకు సౌర విద్యుత్ వినియోగించాలన్న లక్ష్యంతో గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఒక్కో గ్రామంలో కనీసం ఒక మెగావాట్ సౌరవిద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

**ఉత్పత్తి, పంపిణీ బాధ్యతలు మహిళలకే**

ఈ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక పనులు, ఉత్పత్తి ఎలా చేయాలన్న సలహాలు, సూచనలను ప్లాంట్లను నిర్వహించనున్న మహిళా స్వయం సేవా సంఘాలకు ప్రభుత్వ అధికారులు వివరించనున్నారు. వారికి సంపూర్ణ అవగాహన కలిగాక ఉత్పత్తి, పంపిణీ, నిర్వహణ బాధ్యతలన్నీ మహిళలకే అప్పగించనున్నారు. గ్రామీణ, మండల ప్రాంతాల్లో ప్లాంట్లను ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు ప్రభుత్వ భూముల్లో ప్లాంట్లను నిర్మించనున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కువగా లభించిన చోట్ల 2-4 మెగావాట్ల వరకు విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

**అనువైన ప్రాంతాల ఎంపిక**

సౌర విద్యుత్ ప్లాంట్లకు అనువైన ప్రాంతాలు ఎంపికచేస్తున్నాం. ఇప్పటివరకు పది మండలాల్లో కొన్ని గ్రామాలను అధికారులు పరిశీలించారు. 150 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను గుర్తించాం. సౌరవిద్యుత్ పంపిణీకి సమీపంలోని సబ్‌స్టేషన్ల జాబితా సేకరించాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించనున్నాం.సి.నారాయణరెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్

# మంటలు ఆర్పేదెలా?

సారంగాపూర్ : రెండేళ్లుగా అటవీ శాఖ అభివృద్ధి పనులకు నిధులు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అత్యవసర పనులకు మినహా నిధులు జమ కాకపోవడంతో అధికారులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా అడవుల్లో చేపట్టిన పర్క్‌లేషన్ ట్యాంకులు, రాతి కట్టడాలు, చెక్‌డ్యాంలతోపాటు పలు పనులు మంచి సత్ఫలితాలిచ్చాయి. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ మొక్కలను నాటడమే కాకుండా భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొన్నేళ్లుగా నాటుతున్న మొక్కలతో జిల్లాలో 22.94 శాతం ఉన్న అడవుల విస్తీర్ణ శాతం కూడా పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కొడిమ్యాల, మెట్‌పల్లి, రాయికల్‌లో అటవీ శాఖ రేంజ్‌లు ఉండగా, ఆయా రేంజ్‌ల పరిధిలో ఏటా రూ.కోట్లలో కంపా, తదితర నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం నిధుల లేమితో అటవీశాఖ అధికారులు పనులు చేప్పలేక చేతులెత్తేశారు.

**479 కి.మీ ఫైర్‌లైన్లు**

జిల్లాలో అటవీ ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా 479 కి.మీ పొడవునా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసేవారు. గతేడాది నుంచి నిధులు రాకపోవడంతో పూర్తిగా తగ్గిపోయాయి. సారంగాపూర్ సెక్షన్ పరిధిలో 14 కి.మీ పొడవునా ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ప్రతిపాదనలు పంపించగా కేవలం నాలుగు కిలోమీటర్ల ఫైర్‌లైన్ ఏర్పాటుకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అంతేకాకుండా జిల్లాలోని జగిత్యాల రేంజ్ పరిధిలో టేకు వృక్షాలు అధికంగా ఉండగా డిసెంబరు నుంచి మార్చి వరకు ఆకులు రాలుతూనే ఉంటాయి. ఫైర్‌లైను ఏర్పాటు చేసిన పదిహేను రోజుల్లోనే మళ్లీ ఆకులు నేలపై పరచుకొని ఉంటాయి. అంతేకాకుండా టేకు ఆకులలో ఫాస్పరస్ ఎక్కువగా ఉండడంతో మంటలు తొందరగా అంటుకొని వ్యాపించి ఆర్పే వీలులేకుండా విస్తరిస్తాయి. ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసినప్పటికీ మంటలు అదుపు చేసేందుకు అవస్థలు పడుతుండగా, ప్రస్తుతం వాటికి కూడా నిధులు రాకపోవడంతో మంటలను అదుపు చేయడం అటవీ అధికారులకు తలనొప్పిగా మారింది.

**వన్యప్రాణుల దాహార్తి తీరేదెలా?**

జిల్లా వ్యాప్తంగా అయిదు రేంజ్‌ల పరిధిలో 217 అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు ఎక్కువగా సంచరిస్తుంటాయని గతంలోనే అటవీ అధికారులు గుర్తించారు. దీనికి అనుగుణంగా గతంలో అడవుల్లో 240 సాసర్ పిట్లు నిర్మించి ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతుండేవారు. దాదాపు 119 ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు తప్పనిసరిగా నీటి వసతి కల్పించాల్సి ఉంటుంది. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటి వసతి కల్పించాలని ఆదేశాలున్నప్పటికీ పంచాయతీల్లోనూ నిధులు లేకపోవడంతో ఇబ్బందిగా మారనుంది. వేసవి వస్తుండడంతో ముందస్తుగా నిధులు సమకూర్చితేనే వన్యప్రాణుల దాహం తీర్చే అవకాశముంటుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అటవీ అధికారులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

జిల్లాలో అటవీ ప్రాంతాల్లో మంటలు అంటుకోకుండా ఫైర్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే పనులు ప్రారంభించనున్నాం. వన్యప్రాణుల తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పలు పథకాల ద్వారా అటవీ విస్తీర్ణం పెంపునకు కృషి చేస్తున్నాం. అత్యవసర పనులకు నిధుల మంజూరు కావడంతో పనులకు ఇబ్బంది లేకుండా కొనసాగిస్తున్నాం. రవికుమార్, డిప్యూటీ రేంజర్, జగిత్యాల

# అప్రమత్తం.. ప్రమాదరహితం



తాండూరు : నిత్యం ఏ పత్రిక తిరగేసినా, సామాజిక మాధ్యమాలు చూసినా, వార్తలు విన్నా రోడ్డు ప్రమాదం లేని రోజంటూ లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా తిరిగి వచ్చే వరకు ఒకటే ఆందోళన. ఇదీ ప్రస్తుత పరిస్థితి. అయితే ఏళ్ల తరబడి కొందరు, ఉద్యోగంలో చేరింది మొదలు ఇప్పటి వరకు ప్రమాదానికి ఆస్కారం లేకుండా లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీ వాహన చోదకుల కృషి ప్రశంసనీయం. బస్సు స్టీరింగ్ పట్టుకున్నప్పటి నుంచి వారు జాగ్రత్తగా ఉంటున్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రమాద రహిత డ్రైవర్లపై ప్రత్యేక కథనం.

**సెల్‌ఫోన్ వాడను: బాలరాజు**

నేను 2010 జనవరి 1న విధుల్లో చేరా. రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటిస్తా. బస్సు నడిపేటపుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడను. మలుపుల వద్ద మరింత అప్రమత్తంగా ఉంటా. ఇప్పటి వరకు విధులకు గైర్హాజరు కాలేదు. ప్రయాణికులను జాగ్రత్తగా తీసుకెళ్లడమే లక్ష్యం.

**క్రమపద్ధతిలో వెళ్లడమే.: రఫీక్ ఖలాన్**

నేను 1999 ఆగస్టు 1న విధుల్లో చేరా. ఒక్కసారి కూడా గైర్హాజరు కాలేదు. బస్సును జాగ్రత్తగా నడపడమే లక్ష్యం. ఇప్పటి వరకు మూడు సార్లు ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్నా. బస్సును ఓవర్‌టేక్ చేయను. క్రమపద్ధతిగా వెళతా. ఇతర వాహనాలకు ఆటంకం కలిగించను. బస్సు నడిపే సమయంలో ప్రశాంతంగా ఉంటా.

**నిర్ణీత దూరం పాటిస్తా..**

నేను 1997 ఆగస్టు1న డ్రైవర్‌గా విధుల్లో చేరా. అప్పటి నుంచి విధులకు గైర్హాజరు కాలేదు. ముందున్న వాహనాన్ని దాటి వెళ్లను. 50 అడుగుల దూరం పాటిస్తా. ఇప్పటి వరకు ఒక్క ప్రమాదం జరగకుండా విధులు నిర్వహిస్తున్నా. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం. మూడు సార్లు ఉత్తమ డ్రైవర్‌గా సత్కారం అందుకున్నా.
ఐ.ఎన్.రావు, తాండూరు డిపో

**మానసిక ప్రశాంతత..**

ఇంటి నుంచి విధులకు హాజరయ్యే సమయంలో కుటుంబ బాధ్యతలను అక్కడే మరిచిపోతా. ఒక్కసారి బస్సును క్షుణ్ణంగా పరిశీలించాకే స్టీరింగ్ పట్టుకుంటా. ముఖ్యంగా మానసిక ప్రశాంతతతోనే దాదాపు 28 ఏళ్లుగా ఒక్క ప్రమాదం కూడా చేయలేదు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉంటూ రోడ్డు నియమాలను విధిగా పాటించా. ఎదురుగా వస్తున్న వాహనాల విషయంలో అప్రమత్తంగా ఉంటా. వేగం పెంచడం, నెమ్మదిగా నడపడం కూడా ప్రమాదమే. ఇంకా మూడేళ్ల సర్వీస్ ఉంది. అప్పటి వరకు కూడా ప్రమాదాలు లేకుండా నడపాలన్నదే లక్ష్యం.
**మహమ్మద్ రఫీ, డ్రైవర్, పరిగి డిపో**

**వాహనాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ..**

వికారాబాద్ ఆర్టీసీ డిపోలో 18 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న. ప్రమాదరహితంగా నడిపినందుకు, ఇంధన పొదుపు చేయడంతో అవార్డులు వచ్చాయి. విధి నిర్వహణలో ప్రశాంతంగా ఉండడం వల్లే ఇది సాధ్యమైంది. పక్క నుంచి వచ్చే వాహనాలను జాగ్రత్తగా పరిశీలిస్తా.
శివయ్య, వికారాబాద్ డిపో

# వడివడిగా ఇస్తేనే.. వనితకు పెట్టుబడి



తాండూరు : మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ఫ్) రుణాలు మంజూరు చేస్తోంది. నిర్ణీత గడువులోగా అందిస్తున్న వీటితో స్వయం ఉపాధి, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. గడువు సమీపిస్తుండడంతో వేగవంతం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కథనం..

జిల్లాలో గ్రామీణ మహిళలే అధికం. వీరంతా స్వయం సహాయక సంఘాల్లో చేరి,. పొదుపు చేస్తూనే ఏటా రుణాలు పొందుతున్నారు. వీరికి పూచీకత్తు లేకుండా గంటలు, రోజుల వ్యవధిలో స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నారు. దరఖాస్తు చేసిన డ్వాక్రా మహిళ బ్యాంకు ఖాతాలో నేరుగా సొమ్ము జమ చేస్తున్నారు. రుణాల సొమ్మును పెట్టుబడులుగా పెట్టి సొంతూళ్లలోనే ఆసక్తి ఉన్న వ్యాపారం, కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, హోటల్, కిరాణం, దర్జీ దుకాణం, వస్త్ర విక్రయం, అలంకరణ వస్తు విక్రయం, ఆన్‌లైన్ కేంద్రం, బ్యూటీపార్లర్, మగ్గం వర్క్స్ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వచ్చిన ఆదాయంతో రుణ వాయిదాలకు, కుటుంబ అవసరాలకు వెచ్చిస్తున్నారు.

**ఈసారి భిన్నం..:** రుణాల మంజూరుకు రూ.150 కోట్లు సిద్ధంగా ఉన్నప్పటికి పొందలేని పరిస్థితి నెలకొంది. కారణమేమంటే గతంలో రుణాలు పొందిన సభ్యుల నుంచి ఐకేపీ సిబ్బంది రుణ వాయిదాలను వసూలు చేయలేదు. కొన్నిచోట్ల వసూలు చేసినా, కిస్తీల సొమ్మును సొంతానికి వాడుకున్నారు. ఉన్నతాధికారుల విచారణలో అక్రమాలు వెలుగు చూసినప్పటికీ బాధ్యులపై చర్యలు చేపట్టలేదు. సొమ్ము వసూలు చేయలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయి కొత్త రుణాల మంజూరుకు ఆటంకంగా మారింది. ప్రస్తుతం యాభై శాతానికి కూడా చేరలేదు. రోజుకు రూ.50లక్షల చొప్పున ఇస్తేనే లక్ష్యం పూర్తయ్యే ఆస్కారముంది.

**ఇదీ పరిస్థితి..:** జిల్లాలో యాలాల మండలం 97 శాతంతో ప్రథమ స్థానం, 2 శాతంతో నవాబుపేట మండలం చివరన ఉంది. చౌడాపూర్‌లో మండలంలో 86.59 లక్షలు ఇవ్వాల్సి ఉంది. కోట్‌పల్లి, వికారాబాద్, తాండూరు, బొంరాస్‌పేట మండలాల్లో పది శాతంలోపు అందించారు. దౌల్తాబాద్ మండలంలో రూ.1.35 కోట్లతో యాభై శాతం లక్ష్యం పూర్తైంది. కొడంగల్‌లో 48, పూడూరులో 44 శాతం సాధించారు. జిల్లా వ్యాప్తంగా 72 శాతం లక్ష్యం పూర్తి చేయాల్సి ఉంది. ప్రత్యేక దృష్టి సారించి వడివడిగా మంజూరు చేస్తేనే సమకూరనున్నాయి. లేదంటే గడువు ముగిసి మురిగి పోనున్నాయి.

**ప్రత్యేక దృష్టి సారించాం: నర్సింహులు, డీపీఎం**

స్త్రీనిధి రుణాల లక్ష్యం సాధించేందుకు మండలాల వారీగా సమీక్ష నిర్వహిస్తున్నాం. ఎక్కడెక్కడ బకాయిలున్నాయో పరిశీలించి వసూలు చేయడంతోపాటు, కొత్త రుణాలు అందించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం. రెండు నెలల్లో పురోగతి సాధిస్తాం.

జిల్లాలో ఇలా
మండల సమాఖ్యలు: 19
గ్రామైక్య సంఘాలు: 657
స్వయం సహాయక సంఘాలు: 15,699
నమోదైన సభ్యులు: 1.63 లక్షలు
ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం: రూ.49.54కోట్లు
ఇప్పటి వరకు పంపిణీ చేసింది: రూ.13.92 కోట్లు

# వారంలో గోదావరి రెండో దశ టెండర్లు



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం దాహార్తిని తీర్చేందుకు మరో కీలక అడుగు ముందుకు పడుతోంది. 20 టీఎంసీల గోదావరి జలాలను నగరానికి తీసుకొచ్చేందుకు ప్రతిపాదించిన గోదావరి రెండో దశ ప్రాజెక్టుకు వారంలో టెండర్లు పిలవనున్నారు. రూ.7,360 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును 24 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో వెలువడనున్నాయి.గోదావరి నుంచి రెండో దశలో 15 టీఎంసీలు, మూడో దశలో 5 టీఎంసీలు తేవాలని గతంలో నిర్ణయించారు. అయితే నగర తాగునీటి అవసరాలు భారీగా పెరిగిన నేపథ్యంలో రెండో దశలోనే 20 టీఎంసీలు తీసుకురావాలని నిర్ణయించారు. టెండర్ ప్రక్రియకు జలమండలి ప్రాజెక్టుల విభాగం ఏర్పాట్లు పూర్తిచేసింది. హైబ్రీడ్ యాన్యూటీ విధానంలో 60 శాతం నిధులను నిర్మాణ సంస్థ, 40 శాతం నిధులను జలమండలి భరించనున్నాయి. జలమండలి తన వాటా రూ.2,944 కోట్లను హడ్కో రుణంగా తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**నగరంతోపాటు జంట జలాశయాలకు..**

లక్ష్యం: నగర తాగునీటి అవసరాలు తీర్చటంతో పాటు మూసీ పునరుజ్జీవంలో భాగంగా జంటజలాశయాలకు గోదావరి జలాలు తీసుకురావడం. తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు కేటాయించారు. గతంలోనే 10 టీఎంసీలు వినియోగించుకున్నారు. మరో 20 టీఎంసీల నీటి తరలింపునకు తాజాగా రంగం సిద్ధమైంది. **అవసరం..:** 2015లో ఎల్లంపల్లి నుంచి తీసుకొచ్చిన 10 టీఎంసీలు తర్వాత నగరానికి అదనంగా నీరు రాలేదు.ప్రస్తుతం రోజుకు 550 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇవి సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిపాదించిన గోదావరి జలాలు వస్తే తప్పా.. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం కాదు. నగర విస్తరణ దృష్టిలో ఉంచుకుని గోదావరి రెండో దశకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

# బొగ్గు ధర ప్రియం.. ఇతర కంపెనీలే నయం

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తిలో దేశంలోనే ఎంతో అనుభవం ఉన్న కంపెనీ సింగరేణి. స్థానికంగా, సహజ సిద్ధంగా ఉన్న పరిస్థితులు బొగ్గు ధరపై ప్రభావం చూపుతున్నాయి. ఉత్పత్తి వ్యయం పెరుగుతున్న కారణంగా బొగ్గు ధరను పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడున్న భూగర్భ స్థితిగతులు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని పెంచే విధంగా ఉండటంతో దానిని ఏ విధంగా అధిగమించాలన్న దిశగా సంస్థ సమాలోచన చేస్తోంది. ప్రస్తుతం సింగరేణి కంటే ఇతర బొగ్గు పరిశ్రమల్లో టన్ను బొగ్గు ధర చాలా తక్కువగా ఉంది. సింగరేణితో పోల్చితే వెస్టన్ కోల్‌ఫీల్డ్స్, మహానది కోల్‌ఫిల్డ్స్‌లో బొగ్గు ధర తక్కువగా ఉంది. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చుతో చూసుకుంటే మార్కెట్‌లో విక్రయిస్తున్న ధర తక్కువే. కానీ అంతకంటే తక్కువకు విక్రయించాలంటే సంస్థకు నష్టాలు తప్పవు. దీనిని ఏ విధంగా అధిగమించాలన్న విషయమై యాజమాన్యం ప్రణాళికలు చేసుకుంటుంది. బహిరంగ మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవాలంటే తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గును విక్రయించడమే మార్గం.

**అనుకూలంగా లేని భూగర్భ పరిస్థితులు**

రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. అవి చాలా లోతుల్లో ఉండటంతో దానిని వెలికి



తీసేందుకు ఖర్చు ఎక్కువ చేయాల్సి వస్తుంది. ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్‌లో రెండు టన్నుల మట్టిని వెలికి తీస్తే ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేయవచ్చు. సింగరేణిలో కనీసం ఆరు నుంచి ఏడు టన్నుల మట్టిని వెలికి తీస్తే తప్ప టన్ను బొగ్గును ఉత్పత్తి చేయలేం. మట్టి తొలగింపునకే సింగరేణిలో ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. దీని వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. భూగర్భంలో బొగ్గు పొరలు ఏర్పడ్డ ప్రాంతాలు కనీసం 300 నుంచి 1200 మీటర్ల లోతుల్లో ఉన్నాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఇప్పటి వరకు 19,000 మిలియన్ టన్నులకు పైగా ఉన్నట్లు గుర్తించారు. ఇవి తక్కువలో తక్కువ 300 మీటర్ల నుంచి అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం మైనింగ్ చేస్తున్న గనుల్లో అవి 600 మీటర్ల వరకు వెళ్లాయి. అందులోంచి వెలికి తీయాలంటే పైన ఉన్న మట్టిని తొలగించాల్సి ఉంటుంది. భారీ మొత్తంలో ఉన్న మట్టిని తొలగించేందుకు వెచ్చించే వ్యయం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది.

**యంత్రాల పని గంటల పెంపుతోనే...**

సింగరేణి గనుల్లో యంత్రాల పని గంటలు పెంచుకోవడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించే అవకాశం ఉంటుంది. ఒక్కో యంత్రం రోజుకు 18 గంటలు పనిచేస్తే ఆర్థిక భారం తగ్గుతుంది. ఉపరితల గనుల్లో 19 గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి. సింగరేణిలో మొత్తం 828 యంత్రాలు పనిచేస్తున్నాయి. ప్రతి యంత్రం సగటున నాలుగు గంటలు పెంచుకుంటే బొగ్గు ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా వ్యయం తగ్గే అవకాశం ఉంది.

# మహిళా ఆర్థిక శక్తి

సారంగాపూర్: మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ద్వారా సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహిస్తూ బలోపేతం చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. గతంలో సభ్యురాలు రుణం తీసుకోవాలంటే సంఘ సభ్యులంతా కలిసి తీర్మానం చేస్తే బ్యాంకు లింకేజీ రుణం అందించేవారు. ప్రస్తుతం ఎలాంటి షరతులు లేకుండానే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, అంతర్గత రుణాలు అందిస్తున్నారు. ఒక్కో యూనిట్ నెలకొల్పేందుకు రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు రుణం అందిస్తున్నారు. దాదాపు వందకు పైగా వ్యాపారాల నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.7లక్షల మంది మహిళా సంఘ సభ్యులు ఉండగా మహిళా శక్తి పథకం కింద జిల్లాలో 9529



వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు గుర్తించగా 5477 ఎంపిక చేశారు. ఇందులో 3410 యూనిట్లకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద దాదాపు రూ.9 కోట్ల రుణాలు అందించారు. మార్చిలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా డీఆర్డీవో అధికారులు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని సోమన్‌పల్లికి చెందిన సిద్ధం సునీత రూ.5 లక్షల రుణం తీసుకుంది. ఇందులో బ్యాంకు లింకేజీ రూ.లక్ష చొప్పున, లక్‌పతి దీదీ పథకం ద్వారా రూ.2 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.75 వేలు, పొదుపు నుంచి రూ.1.25 లక్షలతో బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేశారు. ప్రతి నెల రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందడమే కాకుండా మరొకరికి ఉపాధి కల్పిస్తోంది.మండలంలోని పోరండ్లకు చెందిన జుంబర్తి శాంత బ్యాంకు లింకేజీ ద్వారా రూ.4 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకున్నారు. గ్రామంలో లేడిస్ ఎంపోరియం, కిరాణ స్టోర్ ఏర్పాటు చేశారు. ప్రతి రూ.10 నుంచి రూ.15 వేల ఆదాయం పొందుతున్నారు.

**ఆదర్శంగా నిలుస్తున్నారు.. - గంగాధర్, ఏపీఎం**

మహిళా శక్తి పథకం ద్వారా వ్యక్తిగత రుణాలు అందించడంతో సొంత వ్యాపారాలు చేసుకుని ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఎవరిపై ఆధారపడకుండా సూక్ష్మ రుణాలు అందించడంతో కుటుంబానికి భారం కాకుండా తోడ్పాటు అందించడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**రూ.5 లక్షల వరకు..- గంగా భవానీ, అధ్యక్షురాలు, మహిళా సంఘం**

గతంలో వ్యక్తిగత రుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు రాకపోవడంతో సొంత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు అందించడంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.



# మిర్చి క్వింటాకు రూ. 11,600 మించి వచ్చేలా చర్యలు- కేంద్రమంత్రి ప్రకటన

ఆంధ్రప్రదేశ్లో మిర్చి రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. రైతులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనే డిస్కషన్స్ జరుగుతున్నట్టు వెల్లడించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో కేంద్రమంత్రులు రామ్మోహన్, పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. మిర్చి రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు చర్చించారు. ఢిల్లీలో జరిగిన కీలక సమావేశంలో మిర్చి రైతులను ఆదుకునేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద ఎంత వరకు సాయం చేయొచ్చు అనే అంశాన్ని చర్చించారు. ఇలా ఆదుకుంటూనే ఎగుమతులు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా మాట్లాడినట్టు కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. ప్రస్తుతం అన్ని పెట్టుబడులు కలుపుకొని మిర్చి రైతుకు క్వింటాకు రూ. 11,600 ఖర్చు అవుతున్నట్టు రాష్ట్రం తెలిపింది. అంతుకు మించి వచ్చేందుకు సాయం చేసేందుకు కేంద్రం రెడీగా ఉందని రామ్ తెలిపారు. అంతర్జాతీయంగా ఉన్న సమస్యలను అధిగమించి మిర్చి ఎగుమతులు ఎలా పెంచుకోవాలి, ఐకార్ ద్వారా రైతులను ఎలా ఆదుకోవాలి అనే అంశాలపై ఈ సమావేశంలో ఎక్కువ దృష్టి పెట్టారు.

ప్రస్తుతం మార్కెట్ ధరకు, రైతుల ఖర్చులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎగుమతిదారులతో కూడా సమావేశమై వారి నుంచి కూడా సూచనలు తీసుకోవాలని తేల్చారు. సమస్యను కేంద్రం దృష్టికి తీసుకొచ్చిన వెంటనే కేంద్రమంత్రి సమావేశమై మిర్చి రైతులపై చర్చించినట్టు కేంద్రమంత్రులు తెలిపారు.




హైదరాబాద్: కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకు నీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాళ్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్.. బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్ జలసౌధలో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు సమాచారం పంపించింది.




సీకే దిన్నె: వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఎస్టేట్ భూములపై అధికారుల బృందం సర్వే చేపట్టింది. ప్రభుత్వ, అటవీశాఖ భూములను ఆక్రమించారనే అభియోగాలపై సమగ్ర సర్వే నిర్వహించారు. వైఎస్ఆర్ జిల్లా సీకే దిన్నె మండలంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కన ఉన్న భూముల్లో రెవెన్యూ, అటవీశాఖ, ల్యాండ్ సర్వేయర్ల బృందాలు సర్వే చేపట్టాయి. సజ్జల కుటుంబానికి ఉన్న 146 ఎకరాల్లో 55 ఎకరాల వరకు అటవీ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సజ్జల కుటుంబ సభ్యులైన సజ్జల సందీప్‌రెడ్డి 71.49 ఎకరాలు, సజ్జల జనార్దన్‌రెడ్డి 16.85 ఎకరాలు, వై.సత్యసందీప్‌రెడ్డి 21.46 ఎకరాలతో సహా సజ్జల విజయకుమారి తదితరులకు మొత్తం 146.75 ఎకరాల భూమి ఉన్నట్లు లెక్కించారు. ఇందులో 55 ఎకరాల వరకు ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించినట్లు గతంలో చేపట్టిన రెవెన్యూ సర్వేలో తేలింది. ఇందులో తమ శాఖ భూములు లేవని అటవీ శాఖ వాదిస్తోంది. రెవెన్యూ శాఖ మాత్రం ఉన్నట్లు రికార్డులు చూపిస్తోంది. సమగ్ర సర్వే చేసి హద్దులు గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికారులు సర్వే చేపట్టారు.

# జగన్ డ్రామాలను ప్రజలు ఛీకొడుతున్నారు.. మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ

గుడివాడ : మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐ ప్యాక్ డ్రామాలను ప్రజలు నమ్మరని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. గుడివాడ టీడీపీ కార్యాలయంలో మంత్రి రవీంద్ర ఇవాళ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... అధికారంలో ఉండగా చేసిన తప్పులను ప్రశ్నిస్తామనే భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. పోలీసులను బెదిరించే నీచ రాజకీయాలకు జగన్ తెర లేపారని మండిపడ్డారు. దళిత సోదరుని కిడ్నాప్ చేస్తే కేసులు పెట్టరా? అని ప్రశ్నించారు. ప్రజలు గుడ్డలూడదీసి రోడ్డుమీద నిల్చోపెట్టిన... జగన్ ప్రవర్తనలో మార్పు రావడం లేదని ఆక్షేపించారు. జగన్ ఏం మాట్లాడుతున్నాడో ఎవరికి అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు మాట్లాడారని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉందని అధికారులు చెప్పిన... రాజకీయ స్వార్థానికే జగన్ మిర్చి యార్డ్‌కు వెళ్లారని అన్నారు. పెయిడ్ ఆర్టిస్టులను రైతులుగా నిలబెట్టి... ఐ ప్యాక్ చేత జగన్ చేస్తున్న డ్రామాలను ప్రజలు ఛీ కొడుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలకు మంత్రి రవీంద్ర కౌంటర్ ఇచ్చారు. బూతులు



మాట్లాడటానికైతే ఉద్యోగం అవసరం.. ప్రజాసేవ చేయడానికి ఉద్యోగం కావాలా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షం, అధికారంలో ఉన్న... ప్రజలకు జవాబుదారీగానే తాము పని చేశామని స్పష్టం చేశారు.

అవినీతి, అరాచకాలు, విధ్వంసంతో నాశనమైన కృష్ణాజిల్లా... ఖ్యాతిని తిరిగి తీసుకువచ్చేందుకు కూటమి నేతలంతా కలిసి కష్టపడుతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# చేనేత వస్త్రాల విక్రయానికి ఏపీ- తమిళనాడు మధ్య ఒప్పందం



విజయవాడ: చేనేత వస్త్రాల విక్రయానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన ఆప్కో, కో ఆప్టెక్స్ సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది రూ.9.20 కోట్ల మేర వస్త్రాలు విక్రయాలు చేయాలని ఆప్కో, కో ఆప్టెక్స్ నిర్ణయించాయి. ఈ మేరకు విజయవాడలో బయ్యర్, సెల్లార్ మీట్‌లో రెండు రాష్ట్రాల చేనేత, జౌళి శాఖల మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో రెండు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని చేనేత వస్త్రాలకు మార్కెట్ విస్తరణలో భాగంగా తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్‌తో ఆప్కో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంతో తమిళనాడుకు చెందిన చేనేత వస్త్రాలను ఆప్కో సహా ఇతర వ్యాపార సంస్థల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్‌లతో పాటు తమిళనాడు వ్యాప్తంగా ఉన్న పలు వస్త్ర దుకాణాల్లో విక్రయించనున్నారు. త్వరలో మిగిలిన రాష్ట్రాలకు చెందిన చేనేత సంస్థలతోనూ ఒప్పందం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.




ఏపీలో ఇంటర్ పరీక్షలకు హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మార్చి 1, 3వ తేదీల నుంచి ప్రారంభం కానున్న ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షల హాల్‌టికెట్లను విద్యార్థులు కాలేజీ లాగిన్‌లతో పాటు వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా 'మనమిత్ర' ద్వారా పొందొచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు.

అలాగే, ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇటీవల ప్రాక్టికల్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కల్పించిన విషయం తెలిసిందే. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వాట్సప్ నంబరు 95523 00009 ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**వాట్సప్‌లో హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ఇలా..** మీ ఫోన్‌లో 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకోండి. Hi అని వాట్సప్ ద్వారా పైన ఇచ్చిన నంబర్‌కు పంపండి. సేవను ఎంచుకోండి అనే లింక్‌పై క్లిక్ చేయాలి. విద్యా సేవలు సెలక్ట్ చేసి క్లిక్ చేయండి. ఇంటర్ ఫస్ట్ ఇయర్/సెకండ్ ఇయర్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి అనే ఆప్షన్ కనబడుతుంది. మీరు ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులైతే టెన్త్ హాల్‌టికెట్/ఆధార్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెకండ్ ఇయర్ విద్యార్థులైతే ఫస్ట్ ఇయర్ హాల్‌టికెట్ నంబర్/ఆధార్ నంబర్‌తో పాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. ఆ తర్వాత కొద్ది నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వచ్చేస్తుంది. డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోండి.

# ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకారం



విజయవాడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో భారతదేశ వైభవం విశ్వవ్యాప్తం అయ్యిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరి వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలు ఇప్పుడు భారతదేశం వైపు చూస్తున్నాయని అన్నారు. దేశ ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలతో పాటు, ఉచితంగా బియ్యం ఇస్తున్నామని తెలిపారు. ఇవాళ(శుక్రవారం) విజయవాడలో కేంద్రమంత్రి హరదీప్ సింగ్ పూరి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో హరదీప్ సింగ్ పూరి మాట్లాడారు. ఏపీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రాజధాని, పోర్ట్‌ల నిర్మాణం కోసం నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఏపీకి డైనమిక్ సీఎం చంద్రబాబు ఉన్నారని ఉద్ఘాటించారు. ఆయన దూరదృష్టి, ముందుచూపుతో ఏపీని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

**3 ఇండస్ట్రీయల్ కారిడార్లు..** ఢిల్లీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను కలిశానని చెప్పారు. రాష్ట్ర ప్రజల క్షేమం, అభివృద్ధి కోసం వారు ఎంతో కష్ట పడుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి అనేక ప్రాజెక్టులకు ఆమోదం ఇవ్వాలని కోరుతున్నారని అన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. టూరిజం టెంపుల్ ద్వారా ప్రజలకు ఆధ్యాత్మికం, ఆహ్లాదం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి మోదీ ఆంధ్రప్రదేశ్‌లోని ఏయిమ్స్ మంగళగిరిని జాతికి అంకితం చేశారని అన్నారు. స్మార్ట్ సిటీస్ మిషన్ కింద అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాలను ఎంపిక చేశారని చెప్పారు. ఇండస్ట్రీయల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద 3 ఇండస్ట్రీయల్ కారిడార్లను అభివృద్ధి చేస్తున్నారన్నారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు నిధులు సమకూర్చి, త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

**5 గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు..** దేశవ్యాప్తంగా పౌర/రక్షణ రంగంలో 85 కొత్త కేంద్రీయ విద్యాలయాల్లో 8 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని చెప్పుకొచ్చారు. తిరుపతి, విజయవాడలోని విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా అభివృద్ధి చేస్తున్నామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో 4,741 కి.మీ.కు పైగా జాతీయ రహదారులు నిర్మాణం చేశామన్నారు. భారతమాల ప్రాజెక్ట్ కింద 5 గ్రీన్ ఫీల్డ్ కారిడార్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. భారతామాల పరియోజన దశ -1 కింద ఆంధ్రప్రదేశ్‌లో 2,525 కి.మీ. జాతీయ రహదారి కారిడార్ల అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఏపీలో రూ. 14,000 కోట్ల విలువైన బెంగళూరు - కడప - విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేలకు 14 ప్యాకేజీలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు.

**ఏపీలో వందశాతం విద్యుదీకరణ...** 2009-2014 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలకు రూ.886 కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. 2024-25లో ఆంధ్రప్రదేశ్‌కు 11రెట్లు అదనంగా రూ.9,417 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎర్రుపాలెం- అమరావతి మీదుగా నంబూరు మధ్య 57 కి.మీ.ల కొత్త లైన్ నిర్మాణం 5 సంవత్సరాల్లో పూర్తి అవుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వందశాతం విద్యుదీకరణ చేయబడిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 6 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయన్నారు. అంతర్జాతీయ ధరలను బట్టి చమురు ధరలు ఉంటాయని తెలిపారు. అవకాశం ఉన్నంతవరకు తగ్గించాలనే తమ భావన కూడా ఉందన్నారు. గత మూడేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు అదుపులో ఉన్నాయని.. తగ్గించామని తెలిపారు. ఉజ్వల కింద గ్యాస్ సిలిండర్‌లను ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. గ్యాస్ పైపు లైన్ వేసేందుకు కోట్ల రూపాయలు కేటాయించామని కేంద్రమంత్రి హరదీప్ సింగ్ పూరి పేర్కొన్నారు.

# గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళన పట్టించుకోరా: వైఎస్ షర్మిల



విజయవాడ: గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. గ్రూప్-2 మెయిన్స్‌కు అర్హత సాధించిన 92,250 మంది అభ్యర్థుల తరుపున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇవాళ(శుక్రవారం) విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ... 2023 డిసెంబర్ 11వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వైఎస్ షర్మిల చెప్పారు.

**తప్పులను సరిదిద్దాలి..** తప్పులను సరిదిద్దకుంటే నష్టం జరుగుతుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వైఎస్ షర్మిల అన్నారు. న్యాయపరమైన ఇబ్బందులతో నోటిఫికేషన్ రద్దయ్యే పరిస్థితులు ఉంటాయని అభ్యర్థులు చెబుతున్నారని తెలిపారు. రోస్టర్ విధానంలో తప్పుల తడకతో ఝార?ండ్‌లో నోటిఫికేషన్ రద్దయ్యిందని గుర్తుచేశారు. ఉద్యోగాలు పోయే పరిస్థితులు ఏపీలో కూడా ఎదురవుతాయని అభ్యర్థులు భయపడుతున్నారని వైఎస్ షర్మిల చెప్పారు.

**అభ్యర్థులతో చర్చించాలి..** తప్పులు సరిదిద్దాలని అభ్యర్థులు కోరుతున్నారని వైఎస్ షర్మిల అన్నారు. హడావిడిగా ఈ నెల 23వ తేదీన పరీక్ష నిర్వహించాల్సిన అవసరం ఏంటని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏపీపీఎస్సీ ఎందుకు మొండిగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఉందని ప్రశ్నించారు. ఏపీ వ్యాప్తంగా రోడ్లపై అభ్యర్థులు ఆందోళనలు చేస్తుంటే వారి విజ్ఞప్తి పట్టించుకోరా అని వైఎస్ షర్మిల నిలదీశారు. రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దే అంశం, మెయిన్స్ పరీక్ష నిర్వహణపై కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని అన్నారు. ఆందోళనలో ఉన్న మెయిన్స్ అభ్యర్థులను పిలిచి ప్రభుత్వం వెంటనే చర్చించాలని షర్మిల డిమాండ్ చేశారు.

# ఏపీలో జీబీఎస్ కేసులు.. ముగ్గురు మృతి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటి వరకు జీబీఎస్ కేసులతో ముగ్గురు మృతి చెందారు. ప్రస్తుతం కర్నూలు లో మరో కేసు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. మరణాలు, కేసులు పెరుగుతుండడంతో ఆందోళన పెరుగుతోంది. మహారాష్ట్ర , తెలంగాణలో విజృంభించిన జీబీఎస్ వ్యాధి ఇప్పుడు ఏపీలో చాప కింద నీరులా వ్యాపిస్తోంది. కేసులు క్రమక్రమంగా పెరుగుతుండడంతో ఆందోళన నెలకొంది. మరోవైపు ప్రభుత్వం కూడా గట్టి చర్యలు చేపట్టింది. ఇంకోవైపు గుంటూరు జీజీహెచ్‌లో నలుగురు చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు జీజీహెచ్‌లో ఇద్దరు మృతి చెందారు. అంతకుముందు ప్రకాశం జిల్లా అలసందలపల్లికి చెందిన కమలమ్మ జీబీఎస్‌తో గుంటూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీంతో మొత్తంగా ఏపీలో ఇప్పటి వరకు మూడు మరణాలు నమోదయ్యాయి. అయితే ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు, వైద్యులు చెబుతున్నా.. కేసులు నమోదుకావడం, మరణాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

కాగా కర్నూలు జిల్లా వాసులను కొత్త వైరస్ వణికిస్తోంది. మొన్నటి వరకు మహారాష్ట్ర, తెలంగాణల్లో కలకలం రేపిన గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ప్రస్తుతం రాష్ట్రంలో కూడా చాపకింద నీరులా వ్యాపించింది. జీబీఎస్ లక్షణాలతో 44 ఏళ్ల మహిళ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆరు రోజుల క్రితం తీవ్ర జ్వరం, కాళ్ల నొప్పులతో బాధపడుతూ ఫీమేల్ మెడికల్ వార్డులో ఆమె అడ్మిట్ అయింది. రోగికి పరీక్షలు నిర్వహించగా.. జీబీఎస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో మహిళను ఏఎంసీ వార్డులో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ కేసుతో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అప్రమత్తమయ్యారు. గురువారం సూపరింటెండెంట్ చాంబరులో జీబీఎస్ వ్యాధి నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి కలుషిత ఆహారం వల్ల సోకుతుందని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జీజీహెచ్‌లో చికిత్సకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గులియన్‌బారే సిండ్రోమ్‌కు నోడల్ ఆఫీసర్‌గా మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దమం శ్రీనివాసులును నియమించారు. ఈ సమావేశంలో సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వర్లు, న్యూరాలజి హెచ్‌ఓడీ సి.శ్రీనివాసులు, మెడిసిన్ హెచ్‌ఓడీ ఇక్బాల్ హుశేన్, పీడీయాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

**జీబీఎస్ లక్షణాలు...** జీబీఎస్ వ్యాధి. ఇది ఒక అరుదైన నరాల వ్యాధి. దీన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధి అని కూడా అంటారు. శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ, నరాలపై ఈ వైరస్ దాడి చేస్తుంది. ఫలితంగా కండరాల బలహీనత, గొంతునొప్పి, నడవలేని స్థితి, అలిసిపోయినట్లుగా అనిపిస్తుంది. మొదటి దశలో చికాకు, నడుమునొప్పి ఉంటుంది. పెరాల్సిస్ మాదిరి పాదాలు, చేతులు, ముఖం నిశ్చేష్టంగా ఉంటుంది. చర్మంలో సూదిగుచ్చినట్లుగా అనిపిస్తుంది. కొన్ని కేసుల్లో కండరాలు పూర్తిగా పని చేయకపోవడం గుండె వేగం మారడం, ఊపిరితిత్తుల సమస్యలు సంభవిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురై వెంటిలేటర్ అవసరం అవుతుంది. ముఖం, కంటి కండరాలపై ప్రభావం కొన్ని సందర్భాల్లో ముఖ నరాలు ప్రభావితమవుతాయి.

**ఎదుర్కొనేందుకు సిద్ధం.. డాక్టర్ కె.వెంకటేశ్వర్లు...** ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. జీబీఎస్ వ్యాధి నివారణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు మందులు అందుబాటులో ఉంచామని, ప్రత్యేకంగా వైద్యులతో నోడల్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇది అంటువ్యాధి కాదని, ప్రజలు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు.

## ఖుషి బ్యాక్ టు స్కూల్ లుక్.. కెవ్వు కేక అంతే..!

శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ ఇప్పటికే అటు బాలీవుడ్ తో పాటు ఇటు సౌత్ ఆడియన్స్ ని అలరిస్తుంది. తెలుగులో ఎన్టీఆర్ సరసన దేవరతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది జాన్వి కపూర్. ఇక నెక్ట్స్ అమ్మడు రామ్ చరణ్ తో కలిసి జత కడుతుంది. ఐతే జాన్వితో పాటు సిల్వర్ స్క్రీన్ ఎంట్రీకి సోదరి ఖుషి కపూర్ కూడా రెడీ అవుతుంది. హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వడానికి ముందే సోషల్ మీడియాలో తన పాపులారిటీ పెంచుకుంటుంది అమ్మడు. ఖుషి కపూర్ ఫోటో షూట్స్ కి సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు. అమ్మడు ఇలా ఫోటో పెడితే చాలు అలా క్షణాల్లో వైరల్ అయిపోతుంది. సినీ ఎంట్రీ కెరీర్ ప్రస్తుతానికి ఇవే టెన్షన్ లేవు కాబట్టి ఎంచక్కా ఎంజాయ్ చేస్తుంది ఖుషి. అక్క ఆల్రెడీ



సినిమాలు చేస్తూ స్టార్ క్రేజ్ తెచ్చుకుంది. నెక్ట్స్ ఖుషి కూడా అదే రేంజ్ లో పాపులారిటీ తెచ్చుకోవాలి. అందుకే సోషల్ మీడియాలో ఒక రేంజ్ లో గ్లామర్ షో చేస్తుంది అమ్మడు. ఖుషి కపూర్ లేటెస్ట్ ఫోటో షూట్ ఫాలోవర్స్ కి షాక్ ఇచ్చింది. బ్యాక్ టు స్కూల్ అంటూ థై షో చేస్తూ అమ్మడు వేసుకున్న మిడ్డీ కుర్రాళ్లని డిస్టబ్ చేస్తుంది. తనలా ఈ రేంజ్ లో రెచ్చిపోవడం ఎవరి వల్ల కాదనిపించేలా అమ్మడి గ్లామర్ షో ఉంది. సినిమాల్లోకి రాకముందే ఈ రేంజ్ లో రెచ్చిపోతుంటే ఇక సినిమాల్లోకి వచ్చాక మరింత గ్లామర్ షో చేసే ఛాన్స్ ఉంటుంది. ఖుషి కపూర్ కూడా కెరీర్ ప్లానింగ్ లో భాగంగానే ఇలా ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని మెప్పిస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా ఈ రేంజ్ లో అందాల ప్రదర్శన చేస్తున్న అమ్మడికి సోషల్ మీడియాలో ఇంకా ఇంకా ఫాలోయింగ్ పెరిగే అవకాశం ఉంటుంది. ఖుషి అలా బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడమే ఆలస్యం సౌత్ మేకర్స్ కూడా ఆమెతో సినిమా తీయాలని చూస్తారని చెప్పొచ్చు. ముఖ్యంగా తెలుగు దర్శకులు ఇప్పటికే ఖుషి కపూర్ ని దృష్టిలో ఉంచుకున్నారని తెలుస్తుంది. మరి చూస్తుంటే రాబోయే రోజుల్లో ఈ కపూర్ సిస్టర్స్ మధ్యనే గట్టి పోటీ ఏర్పడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెప్పొచ్చు.

## ముద్దుగుమ్మ కెరీర్ ఖతం అయినట్లేనా...?

శ్రీలంక నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ హిందీ రియాల్టీ షో ద్వారా ప్రేక్షకులకు పరిచయం అయింది. శ్రీలంకలో టెలివిజన్ రిపోర్టర్‌గా పని చేసిన జాక్వెలిన్ తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. అక్కడ స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాల్లో నటించింది. కానీ ఈ మధ్య కాలంలో ఈ అమ్మడి సినిమాల జోరు తగ్గింది. ముఖ్యంగా ఈమెకు వరుస ఫ్లాప్స్ పడటంతో పాటు, కేసులు చుట్టు ముట్టడంతో కెరీర్ పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. జాక్వెలిన్ కెరీర్ ఖతమేనా అనే చర్చ ప్రారంభం అయింది. ఈ మధ్య కాలంలో జాక్వెలిన్ ఎక్కువగా సోషల్ మీడియాలో కనిపిస్తుంది. సినిమాల్లో అడపా దడపా సినిమాలు చేసినా అవి ప్రత్యేక పాత్రలు, ప్రత్యేక పాటలు మాత్రమే. దాంతో ఆమె కెరీర్‌లో తిరిగి పుంజుకుంటుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతుంది. గత ఏడాదిలో ఈమె చేసిన సినిమాలు తక్కువే ఉన్నాయి. అవి కూడా



ఈమెకి పెద్దగా ఆఫర్లు తెచ్చి పెట్టే పరిస్థితి లేదు. ఆ కారణంగానే జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఈ ఏడాదిలో చేసే సినిమాలు ఎన్ని, ఆమెకు దక్కే సక్సెస్‌లు ఎన్ని అనే విషయంలో సందిగ్ధం నెలకొంది. సాధారణంగా ఒక హీరోయిన్ వరుసగా ఫెయిల్యూర్స్‌ను చవిచూస్తే కెరీర్ పరంగా డౌన్ ఫాల్ మొదలు అయినట్లే అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 2009లో మోడలింగ్‌తో కెరీర్‌ను ఆరంభించిన ఈ అమ్మడు సుజోష్ ఘోష్ యొక్క ఫాంటసీ సినిమా అలాడిన్ కోసం ఆడిషన్స్‌కి వెళ్లింది. అక్కడ మొదలైన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ సినీ ప్రస్థానం కంటిన్యూ అవుతూ వచ్చింది. దాదాపు దశాబ్ద కాలం పాటు వరుస సినిమాలు చేస్తూ వచ్చిన ఈ అమ్మడు ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. పలు అవార్డులను రివార్డులను అందుకుంది. అంతే కాకుండా ఆ సమయంలోనే ఎన్నో షోల్లోనూ జాక్వెలిన్ కనిపించి మెప్పించింది. ఈమె నటించిన బాలీవుడ్ కిక్ 2014లో ప్రేక్షకుల ముందుకు వచ్చి అత్యధిక వసూళ్లు రాబట్టింది. హౌస్ ఫుల్ 3తో 2016లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె ఆ తర్వాత కూడా పలు సినిమాలతో సక్సెస్‌లను సొంతం చేసుకుంది. అయితే గత నాలుగు అయిదు సంవత్సరాలుగా ఈమె కెరీర్‌లో సాలిడ్ సక్సెస్ పడలేదు. ఐటెం సాంగ్స్ చేసినా పెద్దగా ప్రతిఫలం దక్కలేదు. దాంతో ఈ అమ్మడికి సినిమాల్లో ఆఫర్లు తగ్గాయి. ముందు ముందు ఈమెకు ఐటెం సాంగ్స్‌లోనూ ఆఫర్లు వచ్చే పరిస్థితి లేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మళ్లీ బుల్లి తెరపై ఈమె తన ప్రస్థానం మొదలు పెట్టాల్సి ఉంటుందేమో అని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాదిలో కనీసం ఒక్కటి లేదా రెండు సినిమాల్లో అయినా హీరోయిన్‌గా నటించి హిట్ కొడితేనే జాక్వెలిన్ కెరీర్ కొనసాగే అవకాశాలు ఉన్నాయి. లేదంటే కెరీర్ ఖతం అయినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.




## మెగాస్టార్ కోసం రాణీ ముఖర్జీ దిగుతుందా?






మెగాస్టార్ చిరంజీవి 158వ చిత్రం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో లాక్ అయిన సంగతి తెలిసిందే. మెగాస్టార్ లో రౌద్రాన్ని మరోసారి వెండి తెరపై ఆవిష్కరించబోతున్నాడు. భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. 30 ఏళ్ల క్రితం నాటి మెగాస్టార్ ని మళ్లీ చూపించబోతున్నాడు. భారీ మాస్ చిత్రమని ఇప్పటికే ప్రకటన కూడా వచ్చేసింది. చిరంజీవి నుంచి ఇలాంటి సీరియస్ యాక్షన్ థ్రిల్లర్ లు చాలా కాలమవుతుంది. దీంతో శ్రీకాంత్ మార్క్ యాక్షన్ ఎంటర్ టైనర్ అని తేలిపోయింది.

'దసరా'తో తానెంత మాస్ డైరెక్టర్ అన్నది ప్రూవ్ అయింది. ఈ నేపథ్యంలో 158పై అంచనాలు ఇప్పటి నుంచి పీక్స్ కి చేరుతున్నాయి. ప్రస్తుతం శ్రీకాంత్ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడు. సినిమాకు ఎలాంటి నటీనటులని ఎంపిక చేయాలి? టెక్నికల్ టీమ్ ఎలాంటిదై ఉండాలి? తన కాన్సెప్ట్ కి పాన్ ఇండియా అప్పీరియన్స్ రావాలంటే ఏం చేయాలి? అన్న దానిపై సీరియస్ గా వర్క్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ఓ మెగా లీక్ అందింది. ఇందులో హీరోయిన్ గా ఎవర్ని ఎంపిక చేయాలి? అన్న అంశంపై మెగాస్టార్ తో చర్చకు రాగా... బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ అయితే బాగుంటుందని సూచించారుట. రాణీ ముఖర్జీ అయితే చిరంజీవి ఎజ్ ని కూడా బ్యాలెన్స్ చేస్తుంది. చిరంజీవి ఇప్పటికే 70 దగ్గర ఉన్న సంగతి తెలిసిందే. రాణీ ముఖర్జీ కి 46. ఈ జోడీ తెరపై బ్యూటీఫుల్ గా ఉంటుంది. అందులో ఎలాంటి డౌట్ లేదు. ఈ నేపథ్యంలోనే డైరెక్టర్ రాణీ పేరు సూచించగానే చిరంజీవి ఒకే చేసినట్లు లీకులందుతున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ కి రాణీ ముఖర్జీ ఒకే చెప్పాలి. ఈ ప్రపోజల్ ఇంకా హైదరాబాద్ లోనే ఉంది. ఇంకా ముంబై చేరలేదు. చిరంజీవి లాంటి స్టార్ తో ఛాన్స్ అంటే రాణీ నో చెప్పే అవకాశం ఉండదు. అయితే ఆమె ఇంత వరకూ తెలుగులో సినిమాలు చేయలేదు. రెండేళ్ల గా ఆమె హిందీలోనూ కనిపించలేదు. ఈ నేపథ్యంలో కొత్త పరిశ్రమ ఆహ్వానాన్ని ఆమె స్వాగతిస్తుందా? లేదా? అన్నది చూడాలి.

## అకీరా డెబ్యూపై పవన్ అలా డిసైడ్ అయ్యాడా?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఫోకస్ మొత్తం రాజకీయాలపైనే ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత పదవైన డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి పవన్ క్షణం తీరిక లేకుండా ఎంతో బిజీ బిజీగా ఉంటున్నాడు. ఓ వైపు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే, మరోవైపు తాను ఇప్పటికే కమిట్ అయిన సినిమాలను పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నాడు. అందులో భాగంగానే హరిహర వీరమల్లు, ఓజీ సినిమాల షూటింగుల్లో పాల్గొంటూ వాటిని పూర్తి చేస్తున్నాడు పవన్ కళ్యాణ్. ఆ సినిమాలు ఎప్పుడెప్పుడు రిలీజవుతాయా అని పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దీంతో పాటూ పవన్ కళ్యాణ్ కొడుకు అకీరా నందన్ డెబ్యూ కోసం కూడా మెగా ఫ్యాన్స్ ఎంతో కాలంగా వెయిట్ చేస్తున్నారు. అయితే స్టార్ హీరోల వారసులంతా చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి సినిమాలు చేసుకుంటూ వెళ్తుంటే పవన్ మాత్రం తన కొడుక్ని ఇంకాస్త వయసొచ్చాక సినిమాల్లోకి తీసుకురావాలని చూస్తున్నాడట. ఈ నేపథ్యంలో 2027 తర్వాతే అకీరాను ఇండస్ట్రీకి పరిచయం చేయాలని నిర్ణయించుకున్నాడట పవన్. అకీరా కాస్త పెద్దగా అయితే మ్యాన్లీ లుక్ లో తన స్క్రీన్ ప్రెజెన్స్ ఇంకా బావుంటుందని పవన్ భావిస్తున్నాడట. మెగా ఫ్యామిలీ నుంచి వస్తున్న హీరో కావడంతో అకీరా డెబ్యూపై అందరికీ భారీ అంచనాలున్నాయి. అయితే అకీరాను లాంచ్ చేసే బాధ్యతను పవన్, త్రివిక్రమ్ పై పెట్టినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే అకీరాకు యాక్టింగ్ కంటే మ్యూజిక్ అంటేనే ఇష్టమని, అకీరా తల్లి రేణూ దేశాయ్ ఇప్పటికే పలుమార్లు చెప్పింది.

ఈ నేపథ్యంలోనే ఓజీ కోసం అకీరాతో వర్క్ చేస్తా అని తమన్ కూడా చెప్పాడు. ఏదేమైనా అకీరా యాక్టింగ్ పరంగా సినిమాల వైపు అడుగేయాలంటే మరికొంత టైమ్ పడుతుందని అర్థమవుతుంది. పవన్ ఏపీ రాజకీయాల్లో బిజీ అయినప్పటి నుంచి అకీరా బయట కాస్త ఎక్కువగానే కనిపిస్తున్నాడు. రీసెంట్ గా పవన్ తన భార్య లెజెనొవా, కొడుకు అకీరాతో కలిసి మహా కుంభమేళాకు కూడా వెళ్లగా ప్రస్తుతం దానికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరలవుతున్నాయి.

## ఆర్సీ 16 లో ప్రగ్యాజైశ్వాల్ కి ఛాన్సా?

ముంబై బ్యూటీ ప్రగ్యాజైశ్వాల్ టాలీవుడ్ లో మళ్లీ బిజీ అవుతోందా? స్టార్ హీరోల చిత్రాల్లోనే అవకాశాలు అందుకుంటుందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. ఈ సంక్రాంతి కి రిలీజ్ అయిన 'డాకు మహారాజ్' లో నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. ఆ రకంగా బాలయ్య అవకాశం ఇవ్వడంతో? మరో సక్సెస్ ఖాతాలో నమోదైంది. కొత్త ఏడాదిని అమ్మడు అలా లాంచ్



చేసింది. అటుపై వెంటనే అదే బాలకృష్ణ తో 'అఖండ2' లోనూ ఛాన్స్ అందుకుంది. ఇది పాన్ ఇండియా చిత్రం. బోయపాటి శ్రీను భారీ కాన్వాస్ పై తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో ఛాన్స్ రావడంతో ప్రగ్యా ఇమేజ్ రెట్టింపు అయింది. అలాగే సాయి శ్రీనవాస్ బెల్లంకొండ నటిస్తోన్న 'టైసన్ నాయుడు'లోనూ నటిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడికి మరో బంపర్ ఆఫర్ కూడా వరించినట్లు తెలుస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో చరణ్ కి జోడీగా ఇప్పటికే జాన్వీ కపూర్ నటిస్తోంది. ఈనేపథ్యంలో ఇదే సినిమాలో ప్రగ్యా జైశ్వాల్ ని ఓ కీలక పాత్రకు ఎంపిక చేసినట్లు సమాచారం. సినిమాలో ఆ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందని మెగా లీకులందుతున్నాయి. ప్రగ్యా జైశ్వాల్ రోల్ చాలా మాసివ్ గా ఉంటుందిట.

తొలుత ఆ పాత్ర కోసం అనసూయని తీసుకోవాలనుకున్నారుట. కానీ ఆమె ఇప్పటికే 'రంగస్థలం'లో మాస్ రోల్ చేయడంతో? ఫ్రెష్ నెస్ రాదని భావించి బుచ్చిబాబు ఫాంలో ఉన్న ప్రగ్యా జైశ్వాల్ అయితే బాగుటుందని అమెని అప్రోచ్ అయినట్లు వినిపిస్తుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి.

## వైట్ డ్రెస్‌లో అందాల వాణి

కపూర్ ఫ్యామిలీకి చెందినప్పటికీ వాణి కపూర్ బాలీవుడ్‌లో సక్సెస్‌ను సొంతం చేసుకోవడంకు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఇండస్ట్రీలో ఈ అమ్మడికి అంత ఈజీగా అవకాశాలు దక్కలేదు. 2013లో శుద్ద్ మూవీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాతోనే ఫిలిం ఫేర్ అవార్డును అందుకుంది. యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన వాణి కపూర్ రెండో సినిమాను సైతం అదే బ్యానర్‌లో చేసింది. నాని హీరోగా రూపొందిన ఆహా కళ్యాణం సినిమాతో వాణి కపూర్ 2014లో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కెరీర్ ఆరంభంలో ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. కెరీర్ ఆరంభించిన దాదాపు నాలుగు ఐదు సంవత్సరాలకు ఈ అమ్మడి స్టార్ డం పెరిగింది. ముఖ్యంగా ఈ అమ్మడు బాలీవుడ్‌లో చేసిన 'వార్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో అక్కడ నుంచి వరుసగా ఆఫర్లు దక్కించుకుంటూ దూసుకు పోతుంది. లేటు వయసులో బిజీ అయింది



అంటూ కొందరు ఈమె గురించి కామెంట్ చేస్తూ ఉంటారు. అందాల ఆరబోత విషయంలో ఏమాత్రం తగ్గకుండా ఆకట్టుకునే అందంతో దూసుకు పోయే ఈ అమ్మడు వరుసగా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ వస్తోంది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. తాజాగా ఈ అమ్మడు హోమ్ గర్ల్ అంటూ ఈ ఫోటోలు షేర్ చేసింది. వైట్ డ్రెస్‌లో ఆకట్టుకునే అందంతో వాణి కపూర్ మరోసారి కన్నుల విందు చేసింది. సాధారణంగానే సన్నగా నాజూకుగా అందంగా కనిపించే ఈ అమ్మడు మరోసారి అంతకు మించి అన్నట్లుగా ఆకట్టుకుంది. వాణి కపూర్ సోషల్ మీడియాలో వైట్ డ్రెస్‌లో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇంతటి అందంకు కాస్త లేట్‌గా అయినా మంచి అవకాశాలు దక్కుతున్నాయని నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రైడ్ 2తో పాటు మరికొన్ని సినిమాలు సైతం షూటింగ్ దశలో ఉన్నాయి. ఈ ఏడాదిలో ఈమె నుంచి కనీసం మూడు లేదా నాలుగు సినిమాలు వస్తాయని తెలుస్తోంది. ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశాలు వస్తున్నా కూడా మంచి పాత్రలు, కథలను చూసి మరీ ఎంపిక చేసుకుంటుంది. సినిమాల ఎంపిక విషయంలో ఈ అమ్మడు తగిన జాగ్రత్తలు పాటిస్తూ మెల్లగా సినిమాలు చేస్తూ వస్తోంది. సినిమాలు మాత్రమే కాకుండా వెబ్ సిరీస్‌లు, ఇతర షోల్లోనూ ఈ అమ్మడు ఆకట్టుకుంటూ ఉంది.



## పోలేపల్లిలో ఎల్లమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్

దుద్యాల: వికారాబాద్ జిల్లా పోలేపల్లిలో రేణుక ఎల్లమ్మ తల్లిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (%=వఝుత్ష్ర తీవసుఎఎ%) దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు రేవంత్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.


## పదేళ్ల పాలనపై.. కేసీఆర్, కిషన్‌రెడ్డి చర్చకు సిద్ధమా?: సీఎం రేవంత్‌రెడ్డి



నారాయణపేట: గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "పదేళ్ల పాటు ఏగ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే.. ఏ నాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదు. గతంలో కొందరు సీఎంలు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేశారు కానీ, జిల్లాకు చేసిందేమీ లేదు. భీమ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండం, కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదు. పదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదు. వైఎస్ఆర్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదు. నా మీద పగతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేశారు. ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు, 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రిగా నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం.. చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తా. పదేళ్లలో ఏమీ చేయని వాళ్లు ఏడాదిలోనే కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్నారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారు. మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దు. భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత నాది" అని సీఎం అన్నారు.

## మేడిగడ్డ కుంగిన వ్యవహారం.. కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. రాజలింగమూర్తి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి కోర్టు విచారణకు స్వీకరించి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియా ద్వారా తనకు ఈ విషయం తెలిసిందని న్యాయమూర్తి చెప్పారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతిచెందితే ఈ పిటిషన్‌పై ఎలా విచారణ చేపడతామని ప్రశ్నించారు. ఫిర్యాదుదారు మృతి చెందినా



విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. వాదనలు వినిపించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.




హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులు కొట్టేయాలని కోరారు. సీఎం రేవంత్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదుతో బంజారాహిల్స్‌లో కేసు నమోదైంది.

బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద సీఎం రూ.2500 కోట్లు తీసుకున్నట్లు కేటీఆర్ ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ కార్యకర్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాల్చినందుకు ముషీరాబాద్ పీఎస్‌లో కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు.

ఎలాంటి కారణాలు లేకుండా పోలీసులు కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదని.. తన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లలేదన్నారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మార్చి 18కి వాయిదా వేసింది.

## రంగరాజన్‌పై దాడి కేసు.. కోర్టుకు వీరరాఘవరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 21: చిలుకూరు దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని పోలీసులు రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు. మూడు రోజులపాటు కస్టడీలో వీర రాఘవరెడ్డిని పోలీసులు విచారించారు. కస్టడీ ముగియడంతో రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచి ఆ తరువాత వీర రాఘవరెడ్డిని చంచల్‌గూడా జైలుకు తరలించనున్నారు. వీర రాఘవరెడ్డి తెలుగు రాష్ట్రాల్లోని ఆరు ప్రధాన ఆలయాలకు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. పలుచోట్ల రామరాజ్య స్థాపన కోసం ఫండ్స్ వసూలు చేసినట్టు విచారణలో బయటపడింది. వీర రాఘవరెడ్డికి సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్ కోసం బ్యాంక్‌కు మొయినాబాద్ పోలీసులు లేఖ రాశారు. ఎప్పటి నుంచి విరాళాలు సేకరించారనే దానిపై వివరాలు రాబట్టారు పోలీసులు. ప్రస్తుతం వీర రాఘవరెడ్డి బ్యాంక్ అకౌంట్‌లో 20,000 మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. ఈ కేసులో మొత్తం 20 మందిని ఇప్పటి వరకు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. మరో నలుగురు పరారీలో ఉండగా... వారి కోసం మొయినాబాద్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మూడు రోజుల పాటు వీరరాఘవరెడ్డిని పోలీసులు విచారించిన సమయంలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రామరాజ్య స్థాపన కోసం ఫండ్స్ ఇవ్వాలంటూ పలు ప్రాంతాల్లో ఒత్తిళ్లకు గురిచేసినట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లను వీరరాఘవరెడ్డి ముందు పెట్టి మరీ పోలీసులు విచారించారు. ఏపీ, తెలంగాణలో ఏయే ప్రాంతాల్లో డబ్బులు వసూలు చేశారనే అంశానికి సంబంధించి ఆరా తీశారు. ఎప్పటి నుంచి విరాళాలు సేకరించారు అనే దానిపై కూడా కాప్స్ విచారించారు. అతడి బ్యాంకులో కేవలం 20 వేలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు... అరెస్ట్ కాక ముందే నగదు మొత్తాన్ని డ్రా చేసినట్లు అనుమానిస్తున్నారు. వీరరాఘవరెడ్డి ఓ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ఏపీ, తెలంగాణలో చాలా మందిని ఆకర్షించినట్లు తెలుస్తోంది. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కూడా రామరాజ్యం పేరుతో వారందరికీ పదువులు ఇచ్చి రిక్రూట్ చేయాలని ఆదేశాలిచ్చి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే చిలుకూరు బాలాజీ ఆలయ అర్చుకుడిపై కూడా దాడి చేసినట్లు సమాచారం. కస్టడీలో అనేక విషయాలను రాబట్టిన పోలీసులు అనంతరం వీరరాఘవరెడ్డిని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపర్చారు.




దిల్లీ: భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ దిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖా గుప్తా తిప్పికొట్టారు. "కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు దిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా..? మొదటిరోజే మేం క్యాబినెట్ సమావేశం జరిపాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చాం. దాంతో ప్రజలకు రూ.10లక్షల మేర వైద్యసహాయం అందనుంది. ఈ పథకాన్ని ఆప్ అమలు చేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దిల్లీ తన హక్కులన్నీ పొందుతుంది. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోండి. ఎంతో మంది మీ పార్టీని వీడాలని చూస్తున్నారు. కాగ్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారు" అని రేఖ దుయ్యబట్టారు. దిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం అందించే పథకాన్ని మొదటి క్యాబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని భాజపా హామీ ఇచ్చిందని, కానీ మొదటిరోజే దానిని ఉల్లంఘించిందని ఆతిశీ విమర్శించారు. దీనిపైనే సీఎం స్పందన వచ్చింది. నిన్న రామ్‌లీలా మైదానంలో భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో దిల్లీ 9వ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆమె సచివాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థిక సహాయం రూ.2,500 జమ చేస్తామని తెలిపారు. దిల్లీ అభివృద్ధి కోసం ఒక్కరోజు కూడా వృథా చేయకుండా శ్రమిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే సభలో ప్రవేశపెడతామని చెప్పారు. ఆమె అధ్యక్షతన దిల్లీ సచివాలయంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో తొలి మంత్రివర్గ భేటీ జరిగింది. అనంతరం మంత్రులందరితో కలిసి యమునా ఘాట్ వద్దకు వెళ్లి హారతి నిర్వహించారు.




## నుమాయిష్‌లో మహిళల పట్ల అసభ్య ప్రవర్తన.. పోలీసుల అదుపులో 247 మంది నిందితులు

హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్-2025) సమయంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 247 మంది నిందితులను 'షీ టీమ్స్' పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మహిళల భద్రత డీసీపీ తెలిపారు.

జనవరి 3 నుంచి ఫిబ్రవరి 17 వరకు కొనసాగిన నుమాయిష్‌లో మొత్తంగా 37 కేసుల్లో చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులకు 2 రోజుల జైలు శిక్ష, 33 మందికి రూ.1,050 చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు. నిందితుల్లో 190 మందిని హెచ్చరికతో వదిలిపెట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 20 కేసులు విచారణ స్థాయిలో ఉన్నాయన్నారు. పట్టుబడ్డ 247 మందిలో 223 మంది పెద్దవారు, 24 మంది మైనర్లు ఉన్నారని చెప్పారు. ఈ మేరకు పోలీసు శాఖ ప్రకటన విడుదల చేసింది.

## మరోసారి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

హైదరాబాద్, ఫిబ్రవరి 21: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీలో 15 మంది సభ్యులకు గాను 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎఐఎంఐ నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తమ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 15 మంది స్టాండింగ్ కమిటీలో ఎంఐఎం నుంచి 8, కాంగ్రెస్ నుంచి 7 సభ్యులు ఉండనున్నారు. బలం లేకపోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు దూరంగా ఉన్నాయి. గతంలో బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ వేయగా.... అధిష్టానం ఆదేశంతో నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారు. గత పదేళ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అవుతూ వస్తున్నాయి. అలాగే గత పదేళ్లలో తొలిసారి కాంగ్రెస్ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీలో చోటు దక్కించుకున్నారు. కాగా.. జీహెచ్‌ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉంటే అందులో 15 మంది స్టాండింగ్




కమిటీ సభ్యులను ప్రతీ ఏడాది ఎన్నుకోవడం జరుగుతుంది. జీహెచ్‌ఎంసీలో పాలనాపరంగా, కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నా మేయర్, డిప్యూటీ మేయర్ అనంతరం ఈ 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎంతో కీలకం. గడిచిన పదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగలేదు. ప్రతీసారి కూడా ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతూనే ఉంది. ఈ సారి కూడా సంఖ్యాబలం లేకపోవడంతో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తప్పుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.

హైదరాబాద్: జీహెచ్‌ఎంసిలో అడ్మిన్‌లో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న జానకిరామ్ రాసలీలల వ్యవహారం బయటపడింది. వేరే మహిళతో ఉండగా అతని భార్య కళ్యాణి.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జానకిరామ్ తన కంటే 20 ఏళ్ల చిన్న వయసున్న అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకొని అక్కడే ఉంటుండగా భార్య కళ్యాణి పట్టుకొని ఇద్దరినీ చితకబాదింది. కుటుంబాన్ని వదిలేసి గత కొద్ది రోజులుగా జానకిరామ్ వారాసిగూడలో ఆ అమ్మాయితో ఉంటున్నాడు. భర్త రోజుల తరబడి ఇంటికి రాకపోవడంతో ఎక్కడికి వెళుతున్నాడని భార్య కళ్యాణి నిగాపెట్టారు. సికింద్రాబాద్ వారాసిగూడలో అపార్టుమెంట్‌లో ఉన్న రద్దరిని కళ్యాణి రెడ్ హ్యాండెడ్‌గా




పట్టుకున్నారు. కాగా జానకిరామ్ ఎక్కడ పనిచేసిన అక్కడ ఆఫీసులో ఉన్న అమ్మాయిలతో అక్రమ సంబంధాలు పెట్టుకుంటాడని భార్య కళ్యాణి తెలిపారు. గొడవ జరుగుతున్న సమయంలో ఇరుగు పొరుగువారు పోలీసులకు సమాచారం అందించడంతో వారాసిగూడ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసు వ్యవహారంలో కీలక పరిణామం

హైదరాబాద్, ఫిబ్రవరి 21: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని భూపాలపల్లి కోర్ట్ ఇచ్చిన ఆర్డర్‌ను కేసీఆర్, హరీష్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై ఈరోజు (శుక్రవారం) న్యాయస్థానంలో విచారణ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని గతంలో భూపాలపల్లి కోర్ట్‌లో హత్యకు గురైన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి ప్రైవేటు పిటిషన్ చేశారు. ఈ కేసులో కేసీఆర్‌తో పాటు హరీష్ రావు, మెగా కృష్ణా రెడ్డి, మిగిలిన ప్రతివాదులకు భూపాలపల్లి జిల్లా కోర్ట్ నోటీసులు ఇచ్చింది. వ్యక్తిగతంగా విచారణకు రావాల్సిందిగా జూలై 10, 2024 నోటీసులు ఇచ్చింది భూపాలపల్లి కోర్టు. కింది కోర్ట్ ఇచ్చిన ఆదేశాలను క్వాష్ చేయాలని కేసీఆర్ తరుపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారుడు రాజలింగమూర్తి చనిపోయాడు కాబట్టి కింది కోర్ట్ ఇచ్చిన ఆదేశాలు ఎత్తివేయాలని కేసీఆర్ తరుపు న్యాయవాది కోరారు. ఫిర్యాదుదారుడు హత్యకు గురైనట్లు న్యూస్‌లో చూశామని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారుడు చనిపోయిన తరువాత కేసు విచారణ అర్హత ఉండదు కదా అని న్యాయస్థానం పేర్కొంది. ఫిర్యాదుదారుడు చనిపోయినా కూడా కేసును కొనసాగించవచ్చని పీపీ వాదనలు వినిపించారు. ఇందులో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, కొంత గడువు ఇస్తే సుప్రీంకోర్టు జెడ్జిమెంట్‌ను న్యాయస్థానం ముందు పెడతామని పీపీ తెలిపారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. తదుపరి విచారణలో ఇరువరి వాదనలు విన్న తరువాత కేసీఆర్, హరీష్‌రావు వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది అనేదానిపై సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com